

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 06-04-2026 | సంపుటి - 27 | సంచిక -314 | రూ : 4 | పేజీలు: 8




## యువత క్రీడామైదానాలను వదిలేసింది...

- పబ్‌లు, డ్రగ్స్ వైపు వెళ్తోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆందోళన
- డ్రగ్స్ కేసుల్లో బాగా చదివినవారే ఉంటున్నారని ఆవేదన
- పోలీసులకు ఇదో సవాల్.. ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని వెల్లడి
- క్రీడాభివృద్ధి కోసమే స్పోర్ట్స్ యూనివర్సిటీ : ముఖ్యమంత్రి

2లో

## న్యాయవ్యవస్థకు మౌలిక సౌకర్యాలు అత్యవసరం

- అవి ఐచ్ఛికం కాదు: సీజేఐ జస్టిస్ సూర్యకాంత్
- హైకోర్టు జోన్-2 భవనాలకు శంకుస్థాపన
- నిర్మాణాలు పూర్తయ్యాక దేశంలోనే ఆదర్శంగా నిలుస్తుందని వ్యాఖ్య
- 2027 డిసెంబరుకల్లా పూర్తి చేస్తాం

2లో






## అమెరికాకు మరో ఎదురు దెబ్బ

- ఏ రెస్క్యూ విమానాన్ని కూల్చేసిన ఇరాన్..ఐదుగురు మృతి
- దిగిరాకుంటే నరకమే : ట్రంప్ అల్టిమేటం
- పట్టించుకోని టెహ్రాన్
- గల్ఫ్‌పై కొనసాగుతున్న దాడులు

2లో



2లో


## వంతెనలు.. విద్యుత్తు ప్లాంట్లు లేపేస్తాం

- హార్ముజ్‌పై గడువు నేటితో ఆఖరు
- కూలిన విమాన పైలట్‌ను కాపాడాం
- అమెరికా బలగాలు ఏడుగంటలు ఇరాన్‌లోనే ఉన్నాయి: ట్రంప్
- సహాయక చర్యలకు వచ్చిన రెండు హెలికాప్టర్లు, విమానాన్ని కూల్చేశాం
- మా నుంచి ఆశ్చర్యకర ప్రతిస్పందన చూస్తారు
- ఇరాన్ హెచ్చరిక..

## హైదరాబాద్‌లో మెగా బస్ టెర్మినల్!

- జీడిమెట్ల గాజులరామారంలో 100 ఎకరాల్లో భారీ బస్ టెర్మినల్
- అంతర్రాష్ట్ర, సిటీ బస్సుల కోసం వేర్వేరుగా టెర్మినల్స్ నిర్మాణం
- ట్రాఫిక్ సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా రూపకల్పన
- ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రత్యేక డిపో, చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు
- టీజీఎస్ఆర్టీసీకి భూమి కేటాయించిన మేడ్చల్ జిల్లా యంత్రాంగం

2లో




### షకూర్ పరిచయమయ్యాకే..

## జిహాదీ భావాలు తీవ్రం

- పాకిస్థాన్ నుంచి ఆయుధాలు, పేలుడు పదార్థాలు తెప్పిస్తానని మాటిచ్చాడు
- అతని ఆదేశాలతోనే ఐసిస్ కార్యకలాపాల వ్యాప్తికి యత్నించాం
- విజయవాడ ఉగ్రమూలాల కేసు నిందితుల వెల్లడి
- ముగిసిన 5 రోజుల కస్టడీ


2లో



## ప్రజా ఉద్యమంగా నీటి భద్రత

- జలవనరుల సంరక్షణకు 100 రోజుల ప్రత్యేక కార్యాచరణ
- భూగర్భ జలమట్టాన్ని కనీసం 1.5 మీటర్లు పెంచడమే లక్ష్యం
- సాగునీటి సంఘాల సభ్యులతో ముఖ్యమంత్రి చంద్రబాబు టెలికాన్ఫరెన్స్

2లో



### మళ్లీ ఇరాన్ ఆయిల్

## కేంద్రం గ్రీన్ సిగ్నల్

2లో



- పశ్చిమాసియా సంక్షోభంతో సరఫరా సమస్యలే కారణం
- ఇరాన్ నుంచి దిగుమతులను ధ్రువీకరించిన కేంద్ర పెట్రోలియం శాఖ
- మంగళూరు పోర్టుకు చేరిన 44,000 టన్నుల ఇరానియన్ ఎల్‌పీజీ

# అమెరికాకు మరో ఎదురు దెబ్బ

ఇరాన్‌పై సాగిస్తున్న యుద్ధంలో అమెరికా దళాలకు మరో ఎదురు దెబ్బ తగిలింది. అమెరికాకు చెందిన ఎఫ్15ఈ యుద్ధ విమానాన్ని ఇరాన్ కూల్చేయడం, దానిలో ఉన్న ఇద్దరు పైలట్లలో ఒకరు గల్లంతైన విషయం తెలిసిందే. అతని కోసం గాలింపు చర్యలు చేపట్టిన రెస్క్యూ విమానాన్ని కూడా కూల్చేశామని ఇరాన్ రివల్యూషనరీ గార్డులు ప్రకటించారు. పైలట్‌ను రక్షించామంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటన చేసిన తర్వాత ఇరాన్ మీడియా ఓ వార్తను అందిం చింది. దాని ప్రకారం... కూలిపోయిన యుద్ధ విమానానికి చెందిన పైలట్ కోసం గాలింపు జరుపుతున్న అమెరికా రెస్క్యూ విమానం సీ130ని ఇస్ఫహాన్ దక్షిణ ప్రాంతంలో ఐఆర్‌జీసీ ధ్వంసం చేసింది. ఖతార్ మీడియా కూడా ఈ విషయాన్ని ధృవీకరించింది. గాలింపు చర్యలు చేపట్టిన విమానాలకు రీఫ్యూయలింగ్ చేయడానికి సీ130 వచ్చింది. అయితే అందులోని సిబ్బంది ఏమైందీ తెలియలేదు. గాలింపు సమయంలో ఇరాన్ దళాలు అనేక అమెరికా విమానాలను ధ్వంసం చేశాయి. ఈ సందర్భంగా ఇరాన్ దళాలు జరిపిన దాడులలో ఐదుగురు చనిపోయారు. కూల్చివేతకు గురైన వాటిలో సీ130 విమానంతో పాటు రెండు బ్లాక్‌హాక్ హెలికాప్టర్లు కూడా ఉన్నాయి.

**పైలట్‌ను రక్షించాం : ట్రంప్**

ఇరాన్‌లో చిక్కుపోయిన రెండో పైలట్‌ను రక్షించామని, ఇది అమెరికా చరిత్రలోనే అత్యంత సాహసోపేతమైన ఆపరేషన్ అని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఇరాన్‌లోని ప్రమాదకరమైన పర్వతాల్లో అతనిని గుర్తించారని, ప్రస్తు తం అతను అమెరికా బలగాల రక్షణలో ఉన్నాడని తెలిపా రు. పైలట్‌ను తీసుకొని రావడానికి ప్రపంచంలోనే అత్యం త ప్రాణాంతక ఆయుధాలతో అనేక విమానాలను పంపా మన్నారు. పైలట్ గాయపడినప్పటికీ కోలుకుంటున్నాడని చెప్పారు.

*** ఇరాన్ సీనియర్ అధికారులను చంపేశాం**

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై జరిపిన దాడులలో ఆ దేశానికి చెందిన పలువురు సీనియర్ సైనికాధికారులు చనిపోయారని ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు. దాడికి సంబంధించి ఒక నిమిషం ఏడు సెకన్ల నిడివి కలిగిన వీడియోను కూడా ఆయన షేర్ చేశారు. అందులో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. ఆకాశంలో దట్టమైన పొగలు అలము కున్నాయి. అయితే ఈ దాడులు ఎప్పుడు జరిగిందీ ట్రంప్ వెల్లడించలేదు. తమతో ఒప్పందం చేసుకొని, హర్మూజ్ జలసంధిని తెరవని పక్షంలో నరకాన్ని చవిచూడాల్సి ఉంటుందంటూ హెచ్చరిక జారీ చేసిన తర్వాత ట్రంప్ ఈ వీడియోను విడుదల చేయడం గమనార్హం. ఇరాన్ కూడా ఈ దాడులపై ఇంతవరకూ స్పందించలేదు. ఇదిలావుండగా యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన ఇరాన్ కమాండర్ ఖస్సెమ్ సోలైమని బంధువుగా గుర్తించిన ఓ మహిళ శాశ్వత నివాస హోదాను అమెరికా రద్దు చేసింది.

# యువత క్రీడామైదానాలను వదిలేసింది

హైదరాబాద్ : యువత మైదానాన్ని వీడి పబ్‌లు, డ్రగ్స్ సంస్కృతి వైపు మళ్లుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మెట్రో నగరాల్లో బయటపడుతున్న డ్రగ్స్ కేసుల్లో ఎక్కువమంది బాగా చదివినవారే ఉంటున్నారన్నారు. ఐటీ, ఫార్మా రంగాల వైపు దృష్టి సారిస్తున్న యువత.. మైదానానికి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. ప్రస్తుతం పోలీసులకు సైబర్ నేరాలు, డ్రగ్స్ నియంత్రణ పెద్ద సవాల్ అని.. అఖిల భారత పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో అన్ని రాష్ట్రాల జట్లు క్రీడా స్ఫూర్తి చాటినట్లుగానే.. డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణలో సత్తా చాటాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఇందుకు తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి సహకారమైనా అందిస్తుందన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం 74వ బీఎన్ మల్లిక్ మెమోరియల్ అఖిల భారత పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ 202526 ముగింపు వేడుకలకు సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ''భారత ఫుట్‌బాల్ చరిత్రలో హైదరాబాద్‌కు గొప్ప పేరుంది. కాలక్రమంలో క్రీడా మైదానాలను వదిలేశాం. ఈ పరిస్థితిని గమనించి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తెలంగాణలో అంతర్జాతీయ స్థాయిలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. దీన్ని పీపీపీ విధానంలో ప్రారంభించి.. గొప్ప క్రీడాకారులను డైరెక్టర్లుగా నియమించాం. పారిశ్రామికవేత్తలు, నిపుణుల్ని భాగస్వాములను చేశాం.

**క్రీడాకారులైతే ఉద్యోగం పక్కా**

క్రీడాకారులైతే మంచి భవిష్యత్తు ఉంటుంది. ఉద్యోగం పక్కా. నేను పెద్ద క్రీడాకారుడినేం కాదు. క్రీడాస్ఫూర్తిని చాటే ఉద్దేశంతోనే పోటీల్లో పాల్గొంటున్నా. అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడు మెస్సీని హైదరాబాద్‌కు తీసుకొచ్చాం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు, ఎస్సీ, ఎస్టీలకు మెస్సీతో కలిసి ఆడే అవకాశం కల్పించాం. బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్‌ని డీఎస్పీగా నియమించి, రూ.2 కోట్లు నజరానా ఇచ్చాం. క్రికెటర్ సిరాజ్‌ను డీఎస్పీగా నియమించాం. పారాలింపిక్స్‌లో పతకం సాధించిన దీప్తిని ప్రోత్సహించాం'' అని సీఎం పేర్కొన్నారు. క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ..''సీఎం ఫుట్‌బాల్ ప్రేమికుడు. అందుకే ఐపీఎల్ మ్యాచ్ జరుగుతున్నా ఫుట్‌బాల్ పోటీకి హాజరయ్యారు'' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీజీపీ శివధర్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ బ్యూరో స్పెషల్ డైరెక్టర్ స్వప్న తివారీ, డీజీలు అభిలాష బిష్త్, శిఖా గోయల్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేశ్, ఆర్గనైజేషన్ విభాగం ఐజీ గజరావ్ భూపాల్, డీఐజీలు అభిషేక్ మహంతి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివాసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవ్యవస్థకు మౌలిక సౌకర్యాలు అత్యవసరం

హైదరాబాద్ : ''న్యాయవ్యవస్థ స్వతంత్రతపై తీర్పులు, సమావేశాలు, రాజ్యాంగ చర్చల్లో తరచూ మాట్లాడుతుంటాం. అయితే ఈ వ్యవస్థ స్వతంత్రతకు మౌలిక వసతులు ఐచ్ఛికం కాదు.. అత్యవసరం'' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. చెల్లాచెదురుగా ఉండే ఇరుకిరుకు భవనాల్లో హైకోర్టు నిర్వహణ ఇబ్బందికరమేనన్నారు. హైదరాబాద్‌లో 100 ఎకరాల్లో నిర్మిస్తున్న హైకోర్టు సముదాయం పూర్తయితే అన్ని కార్యకలాపాలు ఒకేచోట నుంచి సమగ్రంగా నిర్వహించవచ్చని తెలిపారు. కోర్టు హాళ్లు, కార్యాలయాలు, నివాసాలు, శిక్షణ కేంద్రాలన్నీ ఒకేచోట ఏర్పాటవుతున్న ఈ హైకోర్టు భవనం వల్ల న్యాయవ్యవస్థ స్వతంత్రత బలపడుతుందని పేర్కొన్నారు. రాజేంద్రనగర్ బుద్వేలులో ఆదివారం నూతన హైకోర్టు ప్రాంగణంలో జోన్2 కింద న్యాయమూర్తుల నివాస గృహ నిర్మాణాలకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ ఎస్.వి.ఎన్.భట్టి, జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఆలోక్ అరాధే, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్‌లు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ ప్రస్తుత హైకోర్టు భవనం చారిత్రకమైనదే అయినప్పటికీ అవసరాలకు చాలడంలేదన్నారు. న్యాయమూర్తుల సంఖ్య 24 నుంచి 42కు పెరిగిందని, రాబోయే 50 నుంచి వందేళ్ల పాటు అవసరాలకు తగ్గ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకోవడం తప్పనిసరి అన్నారు. 2009లో జరిగిన అగ్నిప్రమాదంతో కొత్త హైకోర్టు నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నా కార్యాచరణలోకి రాలేదన్నారు. అప్పటి నుంచి ప్రధాన న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్, బార్‌కౌన్సిల్ ప్రతినిధులు.. ప్రతి దశలోనూ కొత్త హైకోర్టు నిర్మాణం కోసం తమ గళాన్ని వినిపిస్తూనే ఉన్నారని, చివరికి ప్రస్తుత ప్రభుత్వం 100 ఎకరాలతో పాటు రూ.2,500 కోట్లకు పైగా నిధులు కేటాయించడంతో.. గ్లోబల్ టెండర్ల ద్వారా నిర్మాణ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. దీంతో 17 ఏళ్ల ప్రయత్నాలు సాకారమయ్యాయన్నారు. శంకుస్థాపనలకు ఇక్కడికి రావడం కేవలం లాంఛనం కాదని, రాజ్యాంగ విధి అన్నారు. ఈ హైకోర్టు భవనం పూర్తయితే దేశంలోనే అన్ని వసతులతో ఆదర్శంగా నిలిచే మొదటిదవుతుందన్నారు. 60 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టే జోన్2లో 57 కట్టడాలుంటాయన్నారు.

# ప్రజా ఉద్యమంగా నీటి భద్రత

అమరావతి : రాష్ట్రంలోని చెరువులన్నీ నింపి భూగర్భ జలమట్టాన్ని కనీసం 1.5 మీటర్ల మేర పెంచడమే లక్ష్యంగా ముందుకెళ్లాలని అధికారులు, ప్రజాప్రతినిధులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. వేసవి కంటే ముందు 6 మీటర్లు, వర్షాకాలం పూర్తయ్యే నాటికి 3 మీటర్లకు భూగర్భజల మట్టం ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 5,697 గ్రామాల్లో భూగర్భ జలాల ఎద్దడి ఉన్నట్లు గుర్తించామన్నారు. నీటి భద్రత సాధిస్తే ఇతర రంగాల్లో అభివృద్ధి సులభతరం అవుతుందని స్పష్టం చేశారు. గత పాలకులు జల సంరక్షణ చర్యల్ని పక్కన పడేశారని, పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆయన మండిపడ్డారు. ''నీటి భద్రత సాగునీటి సంఘాల బాధ్యత' కార్యక్రమంపై సాగునీటి సంఘాలు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆదివారం సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ''నీటి భద్రతపై 100 రోజుల కార్యాచరణను అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గం యాడికి నుంచి ప్రారంభిస్తున్నా. ఏప్రిల్ 6 నుంచి జులై 14వ తేదీ వరకు నాలుగు దశల్లో దీన్ని నిర్వహిస్తాం. రాష్ట్రంలోని 60 వేల మంది సాగునీటి సంఘాల సభ్యులు ఈ కార్యక్రమ నిర్వహణ చేపట్టాలి. నీటి భద్రత అంశంలో రైతుల్ని, ప్రజల్ని భాగస్వాములను చేయాలి. దీన్నో ప్రజా ఉద్యమంగా మలచాలి'' అని సూచించారు నీటి పొదుపును కీలకాంశంగా తీసుకుని.. ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపట్టేలా చూడాలని చంద్రబాబు స్పష్టంచేశారు. ''రాష్ట్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకూ నీటి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించేలా కార్యాచరణ ఉండాలి. ప్రతి నీటి చుక్కనూ సంరక్షించడం, ప్రతి ఎకరాకూ నీరందించడం, ప్రతి రైతుకూ భరోసా ఇవ్వడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. గ్రామ పంచాయతీల భాగస్వామ్యంతో ఇది అమలు కావాలి. సాగునీటి సంఘాలు డ్రైవింగ్ ఫోర్సుగా ఉండాలి. జిల్లా, క్షేత్రస్థాయిలో కలెక్టర్ సహా సర్పంచ్ అధ్యక్షతన పనులు చేపట్టాలి'' అని చెప్పారు. చెక్‌డ్యాంలకు మరమ్మతులు, కొత్తవాటి నిర్మాణం

అన్నమయ్య జిల్లాలో చేపట్టిన ప్రాజెక్టు జలధార స్ఫూర్తిగా వాగులు, వంకలు, ఇతర నీటి వనరుల్ని అనుసంధానించాలని చంద్రబాబు సూచించారు. ''ఉపగ్రహ చిత్రాల ఆధారంగా శాస్త్రీయంగా చెరువుల మ్యాపింగ్ చేయాలి. హైడ్రాలజీ మ్యాప్‌ను కూడా విశ్లేషించి అనుసంధాన ప్రక్రియ చేపట్టాలి. సాగు నీటి సంఘాలు వాటర్ బడ్జెట్‌ను తయారు చేయడంతోపాటు వాటర్ ఆడిట్ కూడా చేపట్టాలి. ఫీడర్ ఛానళ్లను క్లియర్ చేయాలి. చెరువులు, కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టాలి. గుర్రపు డెక్క తొలగించాలి. ఫలితంగా ఎక్కువ నీటిని సంరక్షించి ముంపును అరికట్టవచ్చు. అవసరమైన మేరకు చెక్‌డ్యాంలకు మరమ్మతులు చేయాలి. కొత్త వాటి నిర్మాణం చేపట్టాలి. భూగర్భజలాలు మరీ తక్కువగా ఉన్న చోట ప్రత్యేక చర్యలు తీసుకోవాలి'' అని సూచించారు.

## షకూర్ పరిచయమయ్యాకే..
# జిహాదీ భావాలు తీవ్రం

అమరావతి: తొలి నుంచీ తమలో జిహాదీ భావాలున్నప్పటికీ, సామాజిక మాధ్యమాల్లో విదేశీ హ్యాండ్లర్ అల్ హకీం షకూర్‌తో పరిచయం ఏర్పడ్డాకే అవి తీవ్రరూపం దాల్చాయని విజయవాడ ఉగ్రమూలాల కేసులో నిందితులు కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్ (సీఐ సెల్) విచారణలో వెల్లడించినట్లు సమాచారం. అతని ఆదేశాలతోనే నిషేధిత ఉగ్రవాద సంస్థ ఐసిస్ కార్యకలాపాలను భారత్‌లో వ్యాప్తి చేయడానికి, జిహాద్ కోసం ఆత్మాహుతి దాడులకు పాల్పడేలా యువతను ప్రేరేపించడానికి పూనుకున్నామని చెప్పినట్లు తెలిసింది. అందులో భాగంగానే 'బెన్‌ఎక్స్ కామ్' పేరిట ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్‌ల్లో పలు గ్రూపులు ఏర్పాటుచేసి, తీవ్రవాద భావజాలం కలిగిన వారు, జిహాద్ కోసం ప్రాణత్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నవారిని అందులో సభ్యులుగా చేర్చి వారితో నిరంతరం సంప్రదింపులు జరిపే వాళ్లమని వివరించినట్లు సమాచారం. విజయవాడ వాసులు మహమ్మద్ రహంతుల్లా షరీఫ్ (ఏ1), మహ్మద్ డానిష్ (ఏ2), మీర్జా సొహైల్ బేగ్ (ఏ3), హైదరాబాద్‌కు చెందిన సైదా బేగం (ఏ5), బళ్లారి వాసి అబ్దుల్ సలామ్ (ఏ11)ల ఐదు రోజుల పోలీసు కస్టడీ ఆదివారం సాయంత్రంతో ముగిసింది. సీఐ సెల్ అధికారులతో పాటు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ), వివిధ రాష్ట్రాల నిఘాసంస్థల అధికారులూ నిందితుల్ని ప్రశ్నించి వివరాలు రాబట్టారు. 'బెన్‌ఎక్స్ కామ్' గ్రూపులో పాకిస్థాన్ దేశీయులు సభ్యులుగా ఉన్నారని, భారత్‌లో విధ్వంసం సృష్టించేందుకు అవసరమైన ఆయుధాలు, ఇతర పేలుడు పదార్థాలను వారి ద్వారానే తెప్పిస్తానంటూ అల్ హకీం షకూర్.. తమకు చెప్పాడని కొందరు నిందితులు విచారణలో వెల్లడించినట్లు తెలిసింది. జిహాదీ కార్యకలాపాల పట్ల ఆకర్షితులు కావడానికి దారితీసిన పరిస్థితులేంటి, విదేశీ హ్యాండ్లర్లతో పరిచయాలు ఎలా ఏర్పడ్డాయి, భారత్‌లో దాడులకు వేసిన ప్రణాళికలేంటి, బెన్‌ఎక్స్ గ్రూపును ఎలా విస్తరించారు, దాన్ని నడిపించిందెవరు అన్న అంశాలపై నిందితుల్ని ప్రశ్నించి వివరాలు రాబట్టినట్లు సమాచారం.

*** షకూర్ ఆదేశించాడు.. మేం పాటించాం**

'అల్ హకీం షకూర్‌ను నేరుగా ఎప్పుడూ కలవలేదు. ఆయన ఎలా ఉంటారో కూడా తెలీదు. సామాజిక మాధ్యమాల ద్వారానే పరిచయం. ఆయన చెప్పినట్లుగానే నిషేధిత ఉగ్రవాద సంస్థలైన అల్‌ఖైదా ఇన్ ఇండియన్ సబ్‌కాంటినెంట్ (ఏక్యూఐఎస్), ఐసిస్‌తో నిరంతరం సంబంధాలు కొనసాగించాం.

# వంతెనలు.. విద్యుత్తు ప్లాంట్లు లేపేస్తాం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై మళ్లీ తీవ్రస్థాయిలో రెచ్చిపోయారు. ఇష్టమొచ్చిన రీతిలో దుర్భాషలాడుతూ టెహ్రాన్‌కు భీకర హెచ్చరికలు చేశారు. తాను నిర్దేశించిన గడువులోపు హర్మూజ్ జలసంధిని నౌకల రాకపోకలకు వీలుగా తెరవకపోతే ఇరాన్‌లో వంతెనలు, విద్యుదుత్పత్తి కర్మాగారాలను నామరూపాల్లేకుండా చేస్తామని, నరకం చూపిస్తామని హుంకరించారు. 'మంగళవారం పవర్‌ప్లాంట్ డే, బ్రిడ్జ్ డే అవుతుంది. ఇరాన్‌లో వాటన్నింటినీ ఒక్కదెబ్బతో కొట్టిపడేస్తాం. పిచ్చి మూర్ఖుల్లారా! జలసంధిని తెరవండి.. లేదంటే నరకాన్ని చూస్తారు. అల్లాయే మీకు దిక్కు' అని ట్రూత్‌సోషల్‌లో హెచ్చరిక సందేశం రాసుకొచ్చారు. శత్రు భూభాగంలో గల్లంతైన తమ ఎఫ్15ఈ స్ట్రైక్ ఈగల్ యుద్ధవిమాన పైలట్‌ను ఆదివారం కాపాడామని ట్రంప్ ప్రకటించారు. ఆయన తీవ్రంగా గాయపడ్డారని, అయినా ఆ కర్నల్ సాహసోపేతంగా వ్యవహరించారని చెప్పారు. ఇరాన్ గగనతలంపై అమెరికా ఆధిపత్యం తాజా ఆపరేషన్‌తో రుజువైందని ట్రంప్ చెప్పారు. అమెరికాకు చెందిన ఒక్క సైనిక యోధుడినీ యుద్ధభూమిలోనే వదిలేసి వచ్చేది లేదని స్పష్టంచేశారు. రెండుసార్లు శత్రుదేశ భూభాగంలోకి చొచ్చుకెళ్లి ఇద్దరు అమెరికా పైలట్లను కాపాడటం సైనిక చరిత్రలో ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. ఎఫ్15 పైలట్‌ను కాపాడే రెండో ఆపరేషన్‌లో అత్యంత ప్రమాదకర ఆయుధాలతో కూడిన డజన్లకొద్దీ యుద్ధ విమానాలు పాల్గొన్నాయని తెలిపారు. ''శుక్రవారం నుంచి ఆదివారం వరకు గంటలు గడిచే కొద్దీ ఇరాన్ దళాలు అమెరికా పైలట్‌కు చేరువగా కదిలాయి. ఇదే సమయంలో 24 గంటలపాటు పైలట్ లొకేషన్‌ను అమెరికా సైన్యం ఎప్పటికప్పుడు గమనిస్తూ వచ్చింది. ప్రపంచ చరిత్రలోనే అత్యంత ఆధునిక, ప్రమాదకర, వృత్తినిపుణత ఉన్న అత్యుత్తమ సైన్యం అమెరికా సొంతం. ఆ దేవుడు అమెరికాను, మా సేనలను ఆశీర్వదించాలి'' అని సోషల్ మీడియా పోస్టులో ట్రంప్ రాసుకొచ్చారు. తాము జరిపిన భారీ దాడిలో ఇరాన్‌కు చెందిన పలువురు సైనిక ఉన్నతాధికారులు మృతిచెందారని వెల్లడించారు. ఇరాన్ సైన్యాన్ని తప్పుదారి పట్టించిన పలువురు నాయకులు వీరిలో ఉన్నారని తెలిపారు. దాడి ఎక్కడ, ఎలా జరిగింది? లక్ష్యాలు ఏమిటి? అనే అంశాలపై స్పష్టత ఇవ్వలేదు.

*** 140 లక్ష్యాలను ధ్వంసం చేసిన ఇజ్రాయెల్**

ఇజ్రాయెల్ కూడా దాడులను విస్తరించింది. ఇరాన్‌లో 200కు పైగా మౌలిక సదుపాయాలపై తమ బలగాలు దాడులు జరిపాయని, లెబనాన్‌లో హెజ్బొల్లాకు చెందిన 140కు పైగా లక్ష్యాలను ధ్వంసం చేశాయని ఇజ్రాయెల్ వర్గాలు తెలిపాయి. విమానాలపై దాడులకు ఉపయోగించే బాలిస్టిక్ క్షిపణుల ఉత్పత్తి కేంద్రాలనూ ధ్వంసం చేసినట్లు పేర్కొన్నాయి. ఇరాన్ ఉక్కు ఉత్పత్తిలో 70% సామర్థ్యాన్ని దెబ్బతీశామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తెలిపారు. ఇరాన్ కూడా ప్రతిదాడులు కొనసాగిస్తోంది. కువైట్‌లోని ఓ చమురు క్షేత్రంపై డ్రోన్ దాడితో అగ్నిప్రమాదం సంభవించింది.

# హైదరాబాద్‌లో మెగా బస్ టెర్మినల్!

హైదరాబాద్: హైదరాబాద్ నగర వ్యవస్థను ఆధునికీకరించే దిశగా టీజీఎస్‌ఆర్టీసీ కీలక అడుగు వేస్తోంది. జీడిమెట్ల సమీపంలోని గాజులరామారంలో 100 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నగరంలోకి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే బస్సుల వల్ల తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు ఈ టెర్మినల్‌ను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా యంత్రాంగం ఇటీవలే టీజీఎస్‌ఆర్టీసీకి 100 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ స్థలంలో అంతర్రాష్ట్ర, సిటీ బస్సుల కోసం వేర్వేరు టెర్మినల్స్ నిర్మించనున్నారు. ఇందులో భాగంగా సుమారు 30 ఎకరాలను అంతర్రాష్ట్ర బస్సు సర్వీసుల కోసం, మరో 20 ఎకరాల్లో ఆధునిక సౌకర్యాలు, షాపులతో కూడిన సిటీ బస్ టెర్మినల్ నిర్మించాలని అధికారులు భావిస్తున్నారు. ఇక్కడి నుంచే నగరంలోని అన్ని ప్రాంతాలకు బస్సులు నడపనున్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 10 ఎకరాల్లో ఎలక్ట్రిక్ బస్సు డిపో, 15 ఎకరాల విస్తీర్ణంలో ఈవీ బస్సుల కోసం ప్రత్యేక చార్జింగ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఈ బృహత్ ప్రణాళిక పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చితే హైదరాబాద్ శివారు ప్రాంతం నుంచి నగర రవాణా వ్యవస్థ మరింత పటిష్టం కానుంది.

# మళ్లీ ఇరాన్ ఆయిల్: కేంద్రం గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా చమురు సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్న నేపథ్యంలో భారత్ తిరిగి ఇరాన్ నుంచి ముడి చమురు కొనుగోళ్లను ప్రారంభించింది. సుమారు ఏడేళ్ల విరామం తర్వాత ఇరాన్ నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్నట్లు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ శనివారం అధికారికంగా ప్రకటించింది. అమెరికా ఒత్తిడి కారణంగా 2019 మే నెల నుంచి భారత్, ఇరాన్ నుంచి చమురు దిగుమతులను నిలిపివేసిన విషయం తెలిసిందే. పశ్చిమాసియాలో సరఫరా సమస్యలు తలెత్తినప్పటికీ, భారత రిఫైనరీలు తమకు అవసరమైన ముడి చమురును ఇరాన్‌తో సహా పలు దేశాల నుంచి దిగుమతి చేసుకున్నాయని పెట్రోలియం శాఖ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తెలిపింది. ఇరాన్ నుంచి దిగుమతులకు చెల్లింపుల విషయంలో ఎలాంటి అడ్డంకులు లేవని స్పష్టం చేసింది. ఇటీవలే అమెరికా, ఇరాన్‌పై ఉన్న ఆంక్షలను తాత్కాలికంగా సడలించడంతో ఈ కొనుగోళ్లకు మార్గం సుగమమైంది. రాబోయే నెలలకు దేశానికి అవసరమైన పూర్తిస్థాయి ముడి చమురు నిల్వలను ఇప్పటికే భద్రపరిచినట్లు ప్రభుత్వం భరోసా ఇచ్చింది. వాణిజ్య ప్రయోజనాలకు అనుగుణంగా 40కి పైగా దేశాల నుంచి చమురును దిగుమతి చేసుకునే వెసులుబాటు భారత కంపెనీలకు ఉందని వివరించింది. ఇదే క్రమంలో ఇరాన్ నుంచి 44,000 మెట్రిక్ టన్నుల లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పీజీ)ను కూడా భారత్ కొనుగోలు చేసింది. ఈ గ్యాస్‌తో కూడిన నౌక బుధవారం మంగళూరు పోర్టుకు చేరుకోగా, ప్రస్తుతం ఇంధనాన్ని అన్‌లోడ్ చేస్తున్నట్లు మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

# ఘనంగా చైత్రమాసం సంకష్టహర చతుర్థి పూజ వేడుకలు



ప్రజాస్ఫూర్తి, షాద్నగర్ : చైత్రమాసం సంకష్ట హర చతుర్థి పూజలు వినాయక గంజ్ 20వ గణపతి దేవాలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు. ఆదివారం అన్నదానం వేన్నే ప్రభు లింగం అరుణదంపతులు.ఈ కార్యక్రమంలో షాద్ నగర్ పట్టణ వైస్ చైర్మన్ అందె మోహన్, మలగారి సత్యనారాయణ, 12వ వార్డ్ కౌన్సిలర్ కళ్యాణ్ కార్ దిలీప్ కుమార్, 20వ వార్డు కౌన్సిలర్ పినమౌని గోపాల్, 25 వ వార్డు కౌన్సిలర్ సి పెంటయ్య, 27వ వార్డ్ కౌన్సిలర్ మురళీమోహన్(అప్పి), 2వ వార్డ్ కౌన్సిలర్ బచ్చల నరేష్, 28వ వార్డు గాంధీనగర్ కాలనీ వాసులు మహాదేవపూర్ మాజీ సర్పంచ్ రాజిరెడ్డి సౌమ్య దంపతులు, ఎన్నెపల్లి విద్యాసాగర్ కామాక్షి దంపతులు, రాజేశ్వర్ దంపతులు, నందు దంపతులు, ఏ అభిలాష్,అంతటి కోటిలింగం గౌడ్, రెడ్డి జ్ఞానేష్, శ్రీకాంత్,చరణ్, పోకల శ్రీశైలం,చంద్రశేఖర్ , గజవాడ నరసింహులు,యంసాని శ్రీనివాస్, ఆగిరు కృష్ణయ్య దంపతులు, శ్రీధర్, భరత్, మహావీర్, ప్రవీణ్, గౌరీ శంకర్,ఆలయ ట్రస్ట్ సభ్యులు శంకర్ లాల్ లాహోటి, కాకునూరి వెంకటేష్ గుప్తా, సాయి ఈశ్వర్ రెడ్డి,గోవింద్, ఆలయ పూజారి పండిట్ రాజన్ శాస్త్రి,విష్ణు శాస్త్రి, మహిళలు పాల్గొన్నారు.

## లింగోజిగూడెం 3వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షునిగా ఎర్రగోని నవీన్ యాదవ్



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి : చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లింగోజిగూడెం 3వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పర్నె శివారెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ కమిటీ ఎన్నుకున్నారు. లింగోజిగూడెం 3వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షునిగా ఎర్రగోని నవీన్ యాదవ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన ఉపాధ్యక్షునిగా ఎన్నికైన ఎర్రగోని నవీన్ యాదవ్ మాట్లాడుతూ తాను కాంగ్రెస్ పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించి, తనను ఉపాధ్యక్షునిగా ఎన్నిక చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తనకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు బి.ఎన్.రెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుర్వి నర్సింహ గౌడ్, 3వ వార్డు అధ్యక్షుడు పర్నె శివారెడ్డి, కౌన్సిలర్ పల్లె లావణ్య సురేందర్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఎర్రగోని లింగస్వామి యాదవ్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

## అణగారిన వర్గాల బాంధవుడు జగ్జీవన్ రామ్

**– సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: అణగారిన వర్గాల బాంధవుడు బాబు జగ్జీవన్ రామ్ అని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ జయంతోత్సవం సందర్భంగా కొత్తగూడెం పోస్టాఫీసు సెంటర్, పాల్వంచ బస్టాండ్ సెంటర్లలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జయంతి వేడుకలకు సాబీర్‌పాషా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభల్లో ఆయన మాట్లాడుతూ.. బాబుజీ స్ఫూర్తితోనే నేడు బహుజన వర్గాలకు రాజకీయ అధికారం లభిస్తోందని, సమసమాజ స్థాపనలో ఆయన పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. సామాజిక సమానత్వం కోసం జగ్జీవన్ రామ్ చేసిన కృషిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని, అదే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 119వ జయంతి సందర్భంగా కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కంచర్ల జమలయ్య, 18వ డివిజన్ కార్పొరేటర్ కంచర్ల హిమాశ్రీలు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## పేదలకు ఉచిత వైద్య సేవలు

**: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



ప్రజాస్ఫూర్తి, కాప్రా : చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చెర్లపల్లి బస్ స్టాప్ వద్ద నాయకుడు కడియాల పోచయ్య జ్ఞాపకార్థం అపోలో వైద్యశాల సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నియోజకవర్గంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసి ప్రజలకు సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ శిబిరంలో 500 మందికి పైగా ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు , భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:స్వాతంత్ర్య సమరయోధుడు, నవభారత నిర్మాత, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది ఆయన సేవలను స్మరించుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్ చిన్నతనం నుంచే కుల వివక్ష, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడిన ఆయన, విద్యనే ఆయుధంగా మలుచుకుని అన్యాయాలపై గళమెత్తారని తెలిపారు. సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన కృషి నేటి తరానికి ఆదర్శమని ఎస్పీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, వన్‌టౌన్ సీఐ కరుణాకర్, ఎంటీఓ సుధాకర్, అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, ఎస్సైలు ప్రవీణ్, రవి, రామకృష్ణ, మణిషాలు పాల్గొన్నారు

## నాగార్జున నగర్‌లో హిందూ సమ్మేళన ఉత్సవ సమితి ఏర్పాటు



ప్రజాస్ఫూర్తి, కాప్రా : ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ కుషాయిగూడ డివిజన్ పరిధిలోని నాగార్జున నగర్ కాలనీలో హిందూ సమ్మేళన ఉత్సవ సమితి కార్యవర్గాన్ని ఘనంగా ఏర్పాటు చేశారు. హిందూ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతో పాటు ఐక్యతను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ నెల 26న శుభోదయ కాలనీలో నిర్వహించనున్న సమ్మేళనం నేపథ్యంలో ఈ సమితిని ఏర్పాటు చేశారు.ఈ సమితిలో 15కి పైగా కాలనీల నుంచి ప్రతినిధులను ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా మదిర వెంకట రాంబాబు, ఉపాధ్యక్షులుగా కంచుగంట్ల మల్లేశ్, భాస్కర్ పటేల్, కృష్ణ ప్రసాద్, కార్యదర్శిగా భట్టిప్రోలు సూర్యప్రకాష్, సహ కార్యదర్శులుగా శంకర్ రెడ్డి, తూతిక శివ, అరుణ్, కేశవ్, యశ్వంత్ సాగర్, కోశాధికారిగా జయకృష్ణ ఎన్నికయ్యారు. వాసవీ శివా నగర్‌లోని కన్యకా పరమేశ్వరి దేవాలయంలో జరిగిన సమావేశంలో పలు కాలనీల అసోసియేషన్ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మదిర వెంకట రాంబాబు మాట్లాడుతూ హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయడానికి ప్రతి కాలనీ నుంచి అధిక సంఖ్యలో కుటుంబాలు పాల్గొనేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. హిందూ సంస్కృతి గొప్పతనాన్ని భవిష్యత్ తరాలకు అందించడం మన బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు.

## చురుకైన పాత్ర పోషించడానికి "బూత్ లెవెల్ ఏజెంట్లు ముఖ్యం

* **షాద్ నగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండ్రాతి బాలరాజ్ గౌడ్**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయిలో బలోపేతం కావడానికి, ఎన్నికల నిర్వహణలో చురుకైన పాత్ర పోషించడానికి "బూత్ లెవెల్ ఏజెంట్ల" పాత్ర కాంగ్రెస్ పార్టీలో ఎంతో కీలకమని షాద్ నగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండ్రాతి బాలరాజ్ గౌడ్ వెల్లడించారు. శనివారం రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డిని ప్రత్యేకంగా కలుసుకొని జాబితా అందజేశారు. షాద్ నగర్ నియోజకవర్గానికి చెందిన ఆరు మండలాల బూత్ లెవెల్ ఏజెంట్స్ కు సంబంధించిన జాబితాను స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశాలతో డిసిసి అధ్యక్షుడికి అందజేసినట్లు బాలరాజ్ గౌడ్ తెలిపారు. కొందుర్గు మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నందిగామ మండల పార్టీ అధ్యక్షుడు జంగా నరసింహా యాదవ్, కొత్తూరు మండల పార్టీ అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి, మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ తదితరులు డిసిసి అధ్యక్షుడివి ప్రత్యేకంగా కలుసుకుని జాబితాను సమర్పించారు. వీరు ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో ఓటర్ల జాబితా పరిశీలన, ఓట్ల నమోదు, మరియు ఎన్నికల రోజున బూత్ వద్ద పర్యవేక్షణ బాధ్యతలను బి ఎల్ ఏ ఏజెంట్లు నిర్వహిస్తారని నిర్వహిస్తారనీ ఏ ఎన్నికలు అయిన వీరి పాత్ర ఎంతో ముఖ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ వంటి రాష్ట్రాల్లో, ఈ బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశాలను తరచుగా నిర్వహిస్తూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తున్నారనీ ఇప్పుడు ఏ పరిస్థితి అయినా కాంగ్రెస్ పార్టీ అన్ని స్థాయిలలో ఎదుర్కొనేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని బాలరాజు గౌడ్ ప్రకటించారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షుడు నర్సింహారెడ్డి దిశా నిర్దేశం చేసినట్లు తెలిపారు.

## మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టాలి

**– జిల్లా కలెక్టర్ అంకిత్**



ప్రజాస్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం:భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో డా. బాబూ జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ సెంటర్, భద్రాద్రి కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి, డా. బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు అర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ, డా. బాబూ జగ్జీవన్ రామ్ దేశ రాజకీయాల్లో సుదీర్ఘకాలం విశిష్ట సేవలు అందించి, సామాజిక న్యాయ సాధనకు కృషి చేసిన మహానేత అని కొనియాడారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఉన్నత స్థాయికి ఎదగాలంటే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వంలో అనేక శాఖలకు మంత్రిగా సేవలందించడమే కాకుండా దేశ ఉప ప్రధానిగా కూడా సమర్థవంతంగా పనిచేసి ప్రజాసేవకు అంకితభావంతో నిలిచారని తెలిపారు. మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టి సమాజంలో వివక్ష లేకుండా సమానత్వంతో ముందుకు సాగాలని కలెక్టర్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ వేణు గోపాల్, కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సీపీఐ నాయకులు సాబీర్ పాషా, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి ఎం. శ్రీలత, జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్ దాసరి శ్రీనివాస్, కోకన్వీనర్లు చదలవాడ సూరి, కూసపాటి శ్రీనివాస్, మంద హనుమంతు, మద్దెల సూరి తదితరులు, శాఖ సిబ్బంది పాల్గొన్నారు

## ఘనంగా బాబు జగ్జీవన్ రావ్ జయంతి వేడుకలు



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: భారత స్వాతంత్ర్య సమరయోధులు, సంఘసంస్కర్త, మాజీ ఉప ప్రధాని డా" బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి కార్యక్రమాన్ని కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఎన్టీఆర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు మైస నాగయ్య మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ భారతదేశంలో కేంద్ర మంత్రిగా సుదీర్ఘకాలం పనిచేసి రక్షణ, వ్యవసాయ ,కార్మిక శాఖ లాంటి ముఖ్యమైన శాఖలు నిర్వహించి తనదైన ముద్ర వేస్తూ కార్మిక చట్టాలు, హరిత విప్లవం వంటి సంస్కరణలు తీసుకురావడంలో ఎంతో కృషి చేశారని అన్నారు. అట్టడుగు దళిత సామాజిక వర్గంలో పుట్టి అత్యున్నత స్థాయికి చేరిన ఆయన జీవితం ఎంతోమందికి స్ఫూర్తి నిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కోశాధికారి సోమ విష్ణువర్ధన్, కమిటీ సభ్యులు ముందాటి మధుసూదన్ రావు, గోనే శ్యామ్ రావు, దేవేందర్ రెడ్డి, రామకృష్ణ, బిక్షం, కందగట్ల వెంకన్న , మధుసూదన్ రెడ్డి, రాచకొండ ఉపేందర్, రవీందర్, సజ్జనం వెంకటేశ్వర్లు,డోలి జగదీష్, శ్రీహరి, చందా వెంకన్న, ఆవునూరి రవి, కదిర ప్రభాకర్, పగడయ్య,సంతోష్, చుక్కల మధు , భద్రు ,సూర్య తేజ,సురేష్,రాము,రాజన్న,శేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## డయేరియా లక్షణాలతో యువకుడి మృతి!

లింగాపూర్: డయేరియా లక్షణాలతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన కుమురంభీం జిల్లా లింగాపూర్ మండలం ఎల్లాపాటార్ గ్రామ పంచాయతీ పరిధి రాముగూడలో జరిగింది. కాగా, వ్యాధి లక్షణాలతో మరో 9 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాముగూడకు చెందిన ఆత్రం అక్బర్‌షావు (32) బుధవారం గ్రామస్థులతో కలిసి ఉపాధి హామీ పనులకు వెళ్లారు. పని ముగించుకుని ఇంటికి వచ్చాక అతనికి వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా గ్రామంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భోజనం చేశారు. మరుసటి రోజు నుంచి అతనితో పాటు భార్య తుర్పా బాయి, సోదరులు దినకర్‌షావు, బొజ్జిరావు, గ్రామానికి చెందిన ఆత్రం రాము, హీరాబాయి, సీతారాం, సేవుబాయి, మారు, సుజాతలు వాంతులు విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు.

## ఈస్టర్ వేడుకలలో మొక్కలు పంపిణీ చేసిన బాలు నాయక్



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:ఈస్టర్ పండుగను పురస్కరించుకుని లక్ష్మీదేవిపల్లి మండలం సాటివారిగూడెంలోని త్రియేక దేవార్చనాలయంలో అలియన్స్ ఆఫ్ టీచర్స్ అండ్ ఎంప్లాయిస్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు మాలోత్ బాలు నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలతోపాటు విద్యార్థులకు పరీక్షలకు ఉపయోగపడే సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చర్చి ఫాస్టర్ యు.అమృత రావు మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మంచి మార్పునకు దారి తీస్తాయని అన్నారు. అలాగే విద్యతోనే భవిష్యత్తు బలపడుతుందని, ప్రతి విద్యార్థి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, చర్చి సభ్యులు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు, పాస్టర్ డేవిడ్ రాజ్ వెంకటరావు, రమేష్, రాంబాబు, లక్ష్మణ్ నాయక్, నవీన్, చర్చి సభ్యులు పాల్గొన్నారు

## ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై ఫిర్యాదు



ప్రజాస్ఫూర్తి, శ్రీరంగాపురం, వనపర్తి జిల్లా : వనపర్తి జిల్లా కేంద్రంలో శనివారం జరిగినటువంటి గొల్లపల్లి, చీరకపల్లి రిజర్వాయర్ సంబంధించినటువంటి ప్రెస్ మీట్ లో బిఆర్ఎస్ నాయకులు దొడ్ల రాములు చిరుకపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై, వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి మీద చేసినటువంటి అనుచిత వ్యాఖ్యలు, దుర్భాషలాడినందుకు రెండు వర్గాల మధ్య చిచ్చుపెట్టే విధంగా మాట్లాడినందుకు అతనికి ప్రోత్సహించిన వారిపై చట్టపరమైనటువంటి చర్యలు తీసుకోవాలని శ్రీరంగపురం మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు యం.గంగాధర్ యాదవ్ శ్రీరంగపురం మండల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.

## ఘనంగా డా. బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



ప్రజాస్ఫూర్తి, కాప్రా : డా. బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, క్యాత దినేష్ నాయకత్వంలో డా. బాబూ జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలు కుషాయిగూడలో ఘనంగా నిర్వహించారు. కూరగాయల మార్కెట్ సమీపంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అణగారిన వర్గాల సంక్షేమం కోసం డా. జగ్జీవన్ రామ్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, దేశానికి ఉప ప్రధాని గా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధనపాల్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, రామ్మోహన్, శివకుమార్ గౌడ్, కుషాయిగూడ గ్రామానికి చెందిన పలువురు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## చిన్న కొండూరు కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గం ఎన్నిక



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం చిన్నకొండూరు గ్రామ శాఖ అధ్యక్షుడు బక్క మల్లయ్య, ప్రధాన కార్యదర్శి తీగుళ్ల బాలరాజు ఆధ్వర్యంలో ఆదివారం నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. గ్రామ శాఖ ఉపాధ్యక్షులుగా డొప్ప అంజయ్య, పాపగల్ల లింగస్వామి, నత్తి కిరణ్ కుమార్, తీగుళ్ల కృష్ణ కార్యదర్శులుగా భీమనగొని మల్లేష్, చెక్క శంకర్, చీమ కండ్ల సాయి కిషోర్, సహాయ కార్యదర్శిగా ఎస్ కే సాదక్, పాపగాళ్ళ మహేష్, బక్క రవి, కోశాధికారిగా బోయ కృష్ణ, ఆర్గనైజర్లుగా జగన్, నూనె శ్రీనివాస్, చింతల సురేష్‌లు ఎన్నికైనట్లు తెలిపారు.

# జడ్జీలకే రక్షణ కల్పించలేకపోయారు - బెంగాల్ ప్రభుత్వంపై ప్రధాని మోదీ

కూచ్ బెహార్ (పశ్చిమ బెంగాల్), ఏప్రిల్ 5: పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల న్యాయాధికారులను ఘెరావ్ చేసిన ఘటనపై ప్రధాని మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అధికార తృణమూల్ కాంగ్రెస్‌పై మండిపడిన ఆయన.. ప్రభుత్వం 'మహా జంగల్‌రాజ్'గా మారిందన్నారు. కూచ్ బెహార్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న ఆయన.. రాష్ట్రంలో శాంతిభద్రతలు గాడితప్పాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం జడ్జీలకే రక్షణ కల్పించలేకపోయిందని.. ఇక సాధారణ ప్రజలకు ఏం రక్షణ కల్పిస్తుందని విమర్శించారు. ''మాల్దాలో జరిగిన ఘటన తృణమూల్ కాంగ్రెస్ మహా జంగల్ రాజ్‌ను ప్రతిబింబిస్తోంది. ఏ రాజ్యాంగ వ్యవస్థ ప్రాముఖ్యతను టీఎంసీ ప్రభుత్వం గుర్తించదు. ఈ ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్యం దాడికి గురవుతోంది. ఇక్కడ పరిస్థితి ఎలా ఉందంటే.. చివరకు సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని ఈ రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుంది'' అని ప్రధాని మోదీ దుయ్యబట్టారు. ఇలాంటి ప్రజలకు రక్షణ కల్పిస్తుందని ప్రభుత్వం బెంగాల్ నుంచి ఆశించలేమన్నారు. మాల్దాలో ఇటీవల ఓటరు జాబితా ప్రత్యేక



సమగ్ర సవరణ (SIR)లో పాల్గొన్న ఏడుగురు జడ్జీలను.. జాబితాలో పేర్లు గల్లంతైన కొందరు స్థానికులు ఘెరావ్ చేశారు. ఈ సంఘటనకు సంబంధించి ఎంఐఎం పార్టీకి చెందిన ఒక వ్యక్తిని బెంగాల్ పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు ఇదే ఘటనపై జాతీయ దర్యాప్తు సంస్థ (NIA) కూడా విచారణ చేపడుతోంది.

## నకిలీ బాబా శిందే మధ్య ఫోన్ కాల్స్..
## సీడీఆర్ లీక్‌పై వివాదం

ముంబయి, ఏప్రిల్ 05: తాంత్రిక పూజల పేరుతో పలువురు మహిళలపై అత్యాచారాలు జరిపిన కేసులో నాసిక్ నకిలీ బాబా అశోక్ ఖరాత్ అరెస్టైన విషయం తెలిసిందే. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందేతో ఆయన పలుమార్లు ఫోన్‌లో మాట్లాడిన సీడీఆర్ రికార్డులు ఇటీవల బయటకు రావడంతో మహారాష్ట్ర రాజకీయాల్లో గందరగోళం నెలకొంది. గుర్తు తెలియని వాట్సప్ నంబర్ నుంచి ఈ రికార్డింగ్స్ షేర్ చేసినట్లు సామాజిక



కార్యకర్త అంజలీ దమానియా శుక్రవారం వెల్లడించడంతో ఈ విషయం బయటకు వచ్చింది. ఈ ఘటనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ స్పందిస్తూ.. అశోక్ ఖరాత్ కేసుపై దర్యాప్తు జరుగుతున్న సమయంలో ఆడియోలు బయటకు ఎలా లీక్ అయ్యాయనే విషయంపై ఈడీ (ED)తో దర్యాప్తు జరిపిస్తామన్నారు. ఒకరి కాల్ డేటా రికార్డులను పొందే హక్కు మరొకరికి ఉండదన్నారు. ఈ డేటా ఎలా, ఎవరి ద్వారా లీక్ అయ్యిందో తెలుసుకుంటామన్నారు. అశోక్ ఖరాత్ అనేక అక్రమాలకు పాల్పడినట్లు ఇప్పటికే తమ దృష్టికి వచ్చిందన్నారు. మరోవైపు ఉప ముఖ్యమంత్రి శిందేపై చేస్తున్న తప్పుడు ప్రచారాలపై సమగ్ర విచారణ జరపాలని ప్రతిపక్ష ఎన్సీపీ (ఎస్పీ) డిమాండ్ చేసింది.

## సినిమా ఇంకా ఉంది మిత్రమా! : ఆమ్‌ఆద్మీకి రాఘవ్ చడ్డా కౌంటర్

న్యూఢిల్లీ: రాజ్యసభలో ఆమ్‌ఆద్మీ పార్టీ ఉపనేతగా ఉన్న రాఘవ్ చడ్డా ను ఆ పార్టీ తొలగించడం తీవ్ర వివాదాస్పదమైంది. పంజాబ్ సమస్యలను పార్లమెంట్‌లో లేవనెత్తకుండా మౌనం వహిస్తున్నారని పార్టీ ఆరోపిస్తోంది. అయితే, ఆప్ విమర్శలను రాఘవ్ చడ్డా మరోసారి తోసిపుచ్చారు. పంజాబ్ కేవలం తనకు రాజకీయ అంశం కాదన్నారు. ఈ మేరకు ఓ వీడియోను ఎక్స్ వేదికగా విడుదల చేసి 'సినిమా ఇంకా మిగిలే ఉంది మిత్రమా!' అంటూ గట్టి కౌంటర్ ఇచ్చారు. పంజాబ్‌తో బలమైన సంబంధం ఉందని రాఘవ్ చడ్డా ఉద్ఘాటించారు. రైతుల కోసం ఎంఎస్‌పీకి చట్టబద్ధత, నన్‌కనా సాహిబ్ కారిడార్, రాష్ట్ర భూగర్భ జలాల తగ్గుదల, భగత్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలనే పలు డిమాండ్లపై పార్లమెంటులో గళం విప్పానని గుర్తుచేశారు. ఆప్ తనను టార్గెట్ చేసిందని ఆరోపించారు. ''పంజాబ్ సమస్యలను లేవనెత్తడంలో విఫలమయ్యానంటూ పార్టీలోని నా మిత్రులు వీడియోలను రిలీజ్ చేశారు. పంజాబ్ కేవలం నాకు రాజకీయం అంశం కాదు. నా ఆత్మ, నా ఇల్లు, నా భూమి, నా విధి'' అని అన్నారు. ఇది



చిన్న ట్రైలర్ మాత్రమే.. సినిమా ఇంకా ఉంది మిత్రమా! అని వీడియోలో పేర్కొన్నారు.

## క్షమాపణలు చెప్పినా.. ఆయన్ను వదిలిపెట్టం: రాహుల్ గాంధీ

బిశ్వనాథ్ చరియాలీ (అస్సాం): అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ క్షమాపణలు కోరినా.. ఆయన్ను వదిలిపెట్టబోమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఆయనపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అస్సాంలోని బిశ్వనాథ్ చరియాలీలో నిర్వహించిన ప్రచార సభలో రాహుల్ పాల్గొని ప్రసంగించారు. హిమంతను దేశంలోనే అత్యంత అవినీతిపరుడైన ముఖ్యమంత్రిగా అభివర్ణించారు. ''అస్సాంకు చెందిన దివంగత గాయకుడు జుబిన్ గార్గ్.. రాష్ట్ర ప్రజలను



ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు తన జీవితాంతం కృషి చేశారు. ఆయన ఎవరితోనూ దురుసుగా ప్రవర్తించలేదు. మా పార్టీ భావజాలం కూడా అలాంటిదే. ద్వేషానికి వ్యతిరేకంగా ప్రేమను పంచడమే మా సిద్ధాంతం. మేం అధికారంలోకి వస్తే.. జుబిన్ మృతి కేసులో నిందితులను 100 రోజుల్లోగా శిక్షిస్తాం'' అని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని ఆరు సామాజిక వర్గాలకు ఎస్టీ హోదా ఇస్తామని, తేయాకు కూలీలకు రోజుకు రూ.450 చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. హిమంత నేతృత్వంలోని భాజపా సర్కారు ప్రజల్లో విద్వేషాన్ని వ్యాప్తి చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. హిమంత అవినీతి చిట్టా ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా వద్ద ఉందన్నారు. ఇక్కడి ప్రభుత్వాన్ని దిల్లీ నుంచి నియంత్రిస్తున్నారని, రాష్ట్రాన్ని భాజపా ఏటీఎంలా మార్చేశారని విమర్శించారు. మరికొన్ని రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటవుతుందని, అప్పుడు హిమంత క్షమాపణలు కోరినా.. ఆయనపై చర్యలు తప్పవని చెప్పారు. హిమంత నేతృత్వంలోని భాజపా సర్కారు ప్రజల్లో విద్వేషాన్ని వ్యాప్తి చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. హిమంత అవినీతి చిట్టా ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా వద్ద ఉందన్నారు. ఇక్కడి ప్రభుత్వాన్ని దిల్లీ నుంచి నియంత్రిస్తున్నారని, రాష్ట్రాన్ని భాజపా ఏటీఎంలా మార్చేశారని విమర్శించారు. మరికొన్ని రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటవుతుందని, అప్పుడు హిమంత క్షమాపణలు కోరినా.. ఆయనపై చర్యలు తప్పవని చెప్పారు.




## వీడియో: పోలీసుల ముందే ప్రమాదకర స్టంట్స్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 05 : సామాజిక మాధ్యమాల్లో లైకులు, వ్యూస్ కోసం కొందరు ఆకతాయిలు బైక్‌తో స్టంట్లు చేస్తూ తమ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. అంతేకాకుండా తోటి ప్రయాణికుల ప్రాణాలతోనూ చెలగాటం ఆడుతున్నారు. ఇలాంటి ఘటన తాజాగా దిల్లీలో చోటుచేసుకుంది. ఇద్దరు యువకులు పోలీసుల వాహనం ముందే ప్రమాదకరంగా బైక్‌పై స్టంట్స్‌తో రెచ్చిపోయారు. చివరకు పోలీసులకు చిక్కారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దేశ రాజధానిలో కొత్వాలి సర్కిల్ వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో ఓ రైడర్ బైక్‌ను అతివేగంగా నడిపాడు. పోలీసుల వాహనం ముందే ప్రమాదకర రీతిలో జిగ్ జాగ్‌లో బైక్ డ్రైవింగ్ చేస్తూ హ్యాండిల్స్‌ని విడిచిపెట్టి బైక్‌పై నిల్చున్నాడు. అతడిని బైక్‌పై ఉన్న మరో వ్యక్తి పట్టుకున్నాడు. తోటి ప్రయాణికులకు ఇబ్బంది కల్గించేలా బైక్‌పై స్టంట్లు చేశారు. ఇది గమనించిన ట్రాఫిక్ పోలీసులు సీసీటీవీ ఫుటేజ్‌ల ఆధారంగా బైక్ రైడర్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని అశుగా గుర్తించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినందుకు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

## యుద్ధం ఎఫెక్ట్.. 864 గంటలుగా ఇంటర్నెట్ బంద్


టెహ్రాన్, ఏప్రిల్ 6: అమెరికాఇజ్రాయెల్‌ల దాడులు మొదలైనప్పటి నుంచి ఇరాన్ దేశవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలను నిలిపివేసిన సంగతి తెలిసిందే. గత ఐదు వారాలుగా ఈ ఆంక్షలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇంటర్నెట్ పర్యవేక్షణ సంస్థ నెట్‌బ్లాక్స్ అంచనా ప్రకారం.. 864 గంటలపాటు ఏకధాటిగా (36 రోజులపాటు) ఈ సేవలు నిలిపివేసిన దేశంగా ఇరాన్ నిలిచింది. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల నేపథ్యంలో ఇరాన్ దేశవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడంతో ప్రపంచ దేశాలతో సంబంధాలు తెగిపోయాయి. దేశీయంగా పరిమిత స్థాయిలోనే ఈ సేవలు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, మయన్మార్, సూడాన్‌తోపాటు పలు దేశాల్లో సంక్షోభ సమయాల్లో ఇలాంటి ఆంక్షలు



విధించిన సందర్భాలు ఉన్నప్పటికీ.. ఇంత సుదీర్ఘ కాలం పాటు ఏ దేశమూ కొనసాగించలేదని నెట్‌బ్లాక్స్ పేర్కొంది. అయితే, ఉత్తర కొరియా మాత్రం ఇంటర్నెట్ ద్వారా ప్రపంచంతో అనుసంధానం కాకుండా మొదటి నుంచీ దూరంగా ఉందని గుర్తు చేసింది. ఉక్రెయిన్, గాజా యుద్ధాల్లో అక్కడి మౌలిక సదుపాయాలు దెబ్బతినడం వల్ల ఇంటర్నెట్ సేవలకు సుదీర్ఘ కాలం అంతరాయం ఏర్పడింది. ఫలితంగా వినియోగదారుల సంఖ్యలో గణనీయంగా తగ్గుదల కనిపించింది. అయినప్పటికీ.. యుద్ధం కారణంగా ఏ దేశం కూడా ఇంటర్నెట్‌ను ఈ స్థాయిలో నిలిపివేయలేదు. అంతేకాదు.. శాటిలైట్ కనెక్షన్లు, వర్చువల్ ప్రైవేటు నెట్‌వర్క్‌ల వంటి ప్రత్యామ్నాయ మార్గాలపైనా ఇరాన్ అధికారులు నియంత్రణ విధించారు. దీంతో పౌరులకు కమ్యూనికేషన్ మార్గాలు లేకుండా పోయాయి.

## జలసంధిని తెరవండి..
## లేదంటే..! ఇరాన్‌పై తీవ్ర వ్యాఖ్యలు

ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్ జలసంధిని తక్షణమే తెరవాలని హెచ్చరించారు. లేదంటే మరో రెండు రోజుల్లో విద్యుత్ ప్లాంట్లు, వంతెనలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తామని, తీవ్ర పర్యవసానాలు తప్పవని హెచ్చరించారు. ఈ క్రమంలో ఇరాన్‌పై తీవ్ర పదజాలంతో




మండిపడ్డారు.

*** ఇరాన్ గగనతలంపై ఏడు గంటలు ఉండి..!**

తీవ్రంగా గాయపడిన తమ ఎఫ్15 యుద్ధ విమాన సిబ్బందిని ఇరాన్‌లోని పర్వత ప్రాంతాల నుంచి రక్షించామని అమెరికా అధ్యక్షుడు వెల్లడించారు. పగటిపూటే.. దాదాపు ఏడు గంటలపాటు శ్రమించి ఈ రెస్క్యూ ఆపరేషన్ చేశామన్నారు. పౌరులకు, విమానాలకు ఎక్కువ ప్రమాదం ఉండే ఇలాంటి ఆపరేషన్ చాలా అరుదని చెప్పారు.

## ఒక్కడిని రక్షించేందుకు నేవీ సీల్స్..
# కదిలొచ్చిన అమెరికా విమానాల దండు!

వాషింగ్టన్/టెహ్రాన్, ఏప్రిల్ 5: తమ ఎఫ్15ఈ స్ట్రైక్ ఈగిల్ ఫైటర్ జెట్ ఇరాన్ గడ్డపై కూలడంతో అమెరికాకు కంటిమీద కునుకులేకుండా పోయింది. ఒక పైలట్‌ను వెంటనే కాపాడినా.. అదే విమానంలో మరో పైలట్ (వెపన్ ఆఫీసర్) జాడ మాత్రం తెలియలేదు. అయితే అతడు గాయపడినా.. నడవగలిగే స్థితిలో ఉండడంతో కలిసొచ్చిందని అమెరికా మీడియా సంస్థల కథనాలు పేర్కొన్నాయి. మరోవైపు అమెరికన్ పైలట్‌ను ఎట్టి పరిస్థితుల్లో పట్టుకోవాలనే లక్ష్యంతో ఇరాన్ గిరిజన తెగలు, ఐఆర్‌జీసీ దళాలు, బసీజ్ ఫోర్స్ రంగంలోకి తీవ్ర స్థాయిలో గాలింపు చేపట్టాయి. నైరుతి ఇరాన్‌లోని పర్వతాలు మ్యాన్ హంట్‌కు వేదికగా మారాయి.




**ఇరాన్ దళాల దృష్టి మళ్లించి..**

మరోవైపు సీఐఏ ఇరాన్ దళాల దృష్టి మళ్లించడానికి పైలట్‌ను రక్షించి.. భూమార్గాన అతడిని కాన్వాయ్‌లో సరిహద్దులు దాటిస్తున్నట్లు ప్రచారం చేసినట్లు అమెరికా అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి సీఐఏనే పైలట్ ఆచూకీని తొలుత గుర్తించి పెంటగాన్‌కు సమాచారం ఇచ్చింది. అదే సమయంలో ఇరాన్ దళాలు అమెరికా పైలట్ సమీపంలోకి వెళుతున్నాయి. మరోవైపు సదరు పైలట్ చిక్కటి పర్వతాల్లో ఇరానీ దళాల కంటపడకుండా 7,000 అడుగుల ఎత్తున ఉన్న ఓ కొండ రాయి దగ్గర దాక్కొన్నట్లు అమెరికా మీడియా పేర్కొంది. అతడి వద్ద కేవలం బేకన్ (ఒక రకమైన సంకేతాలు పరికరం) మరో సెక్యూర్డ్ కమ్యూనికేషన్ పరికరం మాత్రమే ఉన్నాయి. అతడిని బేకన్ వాడొద్దని అమెరికా మిలిటరీ సూచించింది. ఎందుకంటే ఆ సంకేతాలను ఇరాన్ దళాలు పసిగట్టే రిస్క్ ఉంది. ఈ ఆపరేషన్‌కు వందల సంఖ్యలో అమెరికా స్పెషల్ ఫోర్స్‌ను, డజన్ల సంఖ్యలో ఫైటర్ జెట్లు, హెలికాప్టర్లను శనివారం రాత్రి ఇరాన్‌పైకి పంపింది. దీనికి సైబర్, స్పేస్ ఇంటెలిజెన్స్‌ను కూడా విశ్లేషించింది.ఒక దశలో అతడికి కొంత సమీపానికి వచ్చిన ఇరాన్ దళాలపై అమెరికా యుద్ధవిమానాలు బాంబింగ్ చేసి వాటిని దూరంగా ఉంచాయి. అదే సమయంలో ఆరుగురు సభ్యుల నేవీ సీల్ బృందం ఇరాన్ భూభాగంపై దిగి.. సదరు పైలట్‌ను రక్షించింది.

**ఆ విమానాలను పేల్చేసిన అమెరికా..**

అయితే, ఈ ఆపరేషన్‌లో మరో ట్విస్ట్ వెలుగులోకి వచ్చింది. వెపన్ ఆఫీసర్‌ను రక్షించి తరలించే సమయంలో, రెండు రవాణా విమానాలు ఇరాన్‌లోని ఓ మారుమూల బేస్ వద్ద చిక్కుకుపోయినట్లు అమెరికా పత్రికా కథనాలు వెల్లడించాయి. అయితే, అవి ఇరాన్‌లో ఏ బేస్ వద్ద చిక్కుకుపోయాయో మాత్రం స్పష్టత ఇవ్వలేదు. అలాగే, ఆ సమయంలో ఇరాన్ దళాల నుంచి అవి ఎలా తప్పించుకున్నాయో కూడా పేర్కొనలేదు. ఇక అమెరికా సైనిక కమాండర్లు ఆ విమానాల్లోని దళాలను తరలించేందుకు మరో మూడు రవాణా విమానాలు పంపించారు. అక్కడే వదిలేసిన విమానాల్లోని సున్నితమైన పరికరాలు ఇరాన్‌కు దక్కకుండా వాటిని పేల్చేసినట్లు వెల్లడించాయి. ఇక రక్షించిన పైలట్‌ను చికిత్స నిమిత్తం కువైట్‌కు తరలించినట్లు పేర్కొన్నాయి. అయితే ఇరాన్ ఐఆర్‌జీసీ దళాల వాదన వేరే విధంగా ఉంది. ఈ రెస్క్యూ ఆపరేషన్‌కు వచ్చిన సి130 విమానం, రెండు బ్లాక్ హాక్ హెలికాప్టర్లను పేల్చేసినట్లు ప్రకటించింది. మరోవైపు కొన్ని హెలికాప్టర్లు దెబ్బతినట్లు అమెరికా పత్రికలు తమ కథనాల్లో పేర్కొన్నాయి.

## హర్మూజ్‌ను దాటిన 'గ్రీన్ ఆశా'

గల్ఫ్ నుంచి భారీ ఎల్పీజీ లోడ్‌తో భారత్‌కు బయల్దేరిన మరో నౌక 'గ్రీన్ ఆశా' హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. మరికొన్ని రోజుల్లో ఇక్కడికి చేరుకోనుంది. హర్మూజ్‌ను సురక్షితంగా దాటి వచ్చిన తొమ్మిదో భారత నౌక ఇది. జలసంధి నుంచి ఇప్పటివరకు భారత జెండాతో ఎనిమిది నౌకలు సురక్షితంగా హర్మూజ్ దాటి వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీటిలో రెండు ఎల్పీజీ నౌకలు గత రెండు రోజుల్లో హర్మూజ్‌ను దాటాయని అధికారులు పేర్కొన్నారు. ఇవి రెండు కలిపి 94 వేల టన్నుల ఎల్పీజీని తీసుకొస్తున్నాయన్నారు. ప్రస్తుతానికి భారత జెండా కలిగిన నౌకలను స్వదేశానికి తీసుకురావడానికే ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు.



## అరుదైన మైలురాయి చేరుకున్న అమూల్..

### ఏడాదిలో లక్ష కోట్ల వ్యాపారం




**న్యూఢిల్లీ:** దేశంలో డైరీ ఉత్పత్తుల్లో అగ్ర సంస్థగా ఉన్న అమూల్ అరుదైన ఘనత సాధించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో లక్ష కోట్ల వ్యాపార సంస్థగా నిలిచింది. ఈ ఏడాది సంస్థ ఏకంగా 11 శాతం వృద్ధి సాధించింది. అమూల్.. గుజరాత్‌కు చెందిన సంస్థ. ద గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్ (జీసీఎంఎంఎఫ్) సంస్థ అమూల్ బ్రాండ్‌తో వ్యాపారం నిర్వహిస్తుంటుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 11 శాతం వృద్ధితో, లక్ష కోట్లకుపైగా వ్యాపారాన్ని నిర్వహించినట్లు సంస్థ తాజాగా ప్రకటించింది.

ఈ సంస్థ ఇంతకుముందు 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.90,000 కోట్ల వ్యాపారం సాధించింది. ఇప్పుడు దీన్ని అధిగమించి, భారీ లాభాలతో లక్ష కోట్లు దాటింది. అమూల్.. దేశంలో టాప్ డైరీ బ్రాండ్‌గా కొనసాగుతోంది. ఈ సంస్థ దాదాపు 1,200 రకాల ఉత్పత్తుల్ని మార్కెటింగ్ చేస్తోంది. ఆధునిక వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు తన మార్కెటింగ్ వ్యూహాల్ని మార్చుకుంటూ వస్తోంది. ఈ ఫెడరేషన్‌లో 18 జిల్లా కో ఆపరేటివ్ సంస్థలు కూడా సభ్యత్వం కలిగి ఉన్నాయి. భారీ చేరుకున్న సందర్భంగా జీసీఎంఎంఎఫ్ చైర్మన్ అశోక్‌భాయ్ చౌదరి స్పందించారు. లక్షలాది మంది వినియోగదారులు, నిరంతరం శ్రమించే 36 లక్షల మంది రైతుల నమ్మకం కారణంగా ఈ విజయం సాధ్యమైందన్నారు. జీసీఎంఎంఎ సంస్థ దేశంలోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా అతిపెద్ద డైరీ సంస్థ. ఇందులో 36 లక్షల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. పాలు, పాల ఉత్పత్తుల్ని 50కిపైగా దేశాల్లో విక్రయిస్తోంది. స్పెయిన్ సహా యూరప్ దేశాల్లో, అమెరికాలోనూ వ్యాపారం చేస్తోంది. రోజూ 31 మిలియన్ లీటర్ల పాలను సేకరిస్తోంది. సంవత్సరానికి 24 బిలియన్ల ప్యాకెట్లు విక్రయిస్తోంది. వీటిలో పాలు, పెరుగు, వెన్న, నెయ్యి, ఐస్ క్రీమ్ వంటి పలు పదార్థాలున్నాయి.

## ఈవారం.. సూచీలపై యుద్ధం

## చమురు ధరల ప్రభావం

### విదేశీ మదుపర్ల అమ్మకాలతో రూపాయిపై ఒత్తిడి

### బుధవారం వెలువడే ఆర్‌బీఐ రేట్ల నిర్ణయంపై దృష్టి

### విశ్లేషకుల అంచనాలు




**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం పరిమిత శ్రేణిలో, ఒడుదొడుకుల్లో పయనించొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అమెరికా-ఇరాన్ యుద్ధ విరమణ విషయమై స్పష్టమైన సంకేతాలు లేకపోవడంతో, మార్కెట్ సెంటిమెంటు బలహీనంగానే ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. హర్మూజ్ జలసంధిని తెరవకపోతే, మంగళవారం ఇరాన్‌పై తీవ్ర దాడులు చేస్తామని చేస్తామని అమెరికా అధ్యక్షుడు ప్రకటించడంతో ముడి చమురు అధిక ధరలు, రూపాయి క్షీణత కొనసాగొచ్చన్న అంచనాలున్నాయి.

మార్చిలో విదేశీ మదుపర్లు రూ.1.17 లక్షల కోట్ల విక్రయాలు జరిపారు. ఈనెలలో తొలి 2 ట్రేడింగ్ రోజుల్లోనే రూ.19,837 కోట్లు ఉపసంహరించారు. ఇందువల్ల రూపాయిపై ఒత్తిడి పెరుగుతున్నందున, వీరి ధోరణీ కీలకం. బుధవారం వెలువడే రిజర్వ్‌బ్యాంక్ పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను గమనించాలి. సమీపకాలంలో నిఫ్టీ-50 సూచీకి 22,200 -22,300 శ్రేణిలో మద్దతు లభించొచ్చని, ఇంతకన్నా దిగితే 21,500-21,000కు చేరొచ్చని సాంకేతిక విశ్లేషకులు పేర్కొంటున్నారు. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

పశ్చిమాసియా ఉద్రిక్తతలు కొనసాగుతున్నందున, నిఫ్టీ బ్యాంక్ సూచీ ఒత్తిడిలోనే ఉండొచ్చు. సోమవారం ప్రారంభమయ్యే ఆర్‌బీఐ సమీక్ష నిర్ణయాలు, భవిష్యత్తు అంచనాలు కీలకం అవుతాయి. నిఫ్టీ బ్యాంక్ సూచీ పెరిగితే 52,500-53,000 వద్ద నిరోధం ఎదుర్కోవచ్చు. సమీప మద్దతు 50,500 శ్రేణిలో పొందొచ్చు.

సమీప కాలానికి లోహ రంగ షేర్లపై బులిష్‌గా ఉన్నారు. యుద్ధ పరిణామాల్లో దిగుమతులకు అంతరాయం ఏర్పడుతున్నందున, దేశీయంగా ధరలు పెరిగి కంపెనీలకు ప్రయోజనం ఏర్పడుతుందని పేర్కొంటున్నారు.

మార్చిలో ఎయిర్‌టెల్, జియో అధికంగా మొబైల్ కనెక్షన్లు జతచేసుకున్న నేపథ్యంలో, టెలికాం కంపెనీల షేర్లు సానుకూలంగా కదలాడొచ్చని చెబుతున్నారు.

చమురు-గ్యాస్ కంపెనీల షేర్లు బేరిష్ ధోరణిలో కొనసాగొచ్చు. దేశీయంగా ఉత్పత్తి చేస్తున్న విమాన ఇంధనం (ఏటీఎఫ్)లో 65% మన విమానయాన సంస్థలకే విక్రయిస్తున్నారు. ఈ ధరను 8.5 శాతమే పెంచినందున, చమురు మార్కెటింగ్ కంపెనీలు ఒత్తిడిలో ఉంటాయి. రిఫైనరీలకు చమురు మార్కెటింగ్ సంస్థలు తక్కువ ధర చెల్లించడంతో వాటిపైనా ఒత్తిడి పడుతోంది. ప్రధాన మార్కెట్‌కు అనుగుణంగా వాహన కంపెనీల షేర్లు తక్కువ స్థాయిల్లో చలించొచ్చు. కృత్రిమమేధ (ఏఐ) టూల్స్ ఫలితంగా ఐటీ కాంట్రాక్టుల విలువలు తగ్గుతాయనే ఆందోళనలు, ఈ రంగ షేర్లపై ఒత్తిడి పెంచొచ్చు. అయితే కొత్త సాంకేతికత అమలు కోసం కొత్త కాంట్రాక్టులు విరివిగా వస్తాయనే అంచనాలనూ కొందరు వ్యక్తం చేస్తున్నారు. ఎఫ్ఎంసీజీ షేర్లు మిశ్రమంగా కదలాడొచ్చు. డిసెంబరు త్రైమాసికం తరహాలోనే ఈ రంగ కంపెనీల జనవరి-మార్చి ఫలితాలుంటాయనే అంచనాలున్నాయి.

ఔషధ సూచీ ఒక శ్రేణిలో చలించొచ్చు. బ్రాండెడ్ ఔషధాలపై 100% దిగుమతి సుంకం విధిస్తామన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికల ప్రభావం భారత కంపెనీలపై పెద్దగా ఉండదు. మనదగ్గర నుంచి జనరిక్స్ అత్యధికంగా ఎగుమతి అవ్వడం ఇందుకు నేపథ్యం. యుద్ధ పరిణామాల్లో వ్యయాలు పెరిగి, నిర్మాణాలు మందగమనంలో సాగుతాయన్న అంచనాలున్నాయి. ఇందువల్ల సిమెంటుకు గిరాకీ తగ్గుతుంది. యుద్ధం ముగింపు దిశగా అడుగులు పడితేనే, దేశీయ సిమెంటు షేర్లు పుంజుకోవచ్చు. యుద్ధం కారణంగా చమురు, ముడిపదార్థాల వ్యయాలు పెరగడం వల్ల, యంత్ర పరికరాల షేర్లు నష్టపోవచ్చు. మౌలిక వసతులపై ప్రభుత్వ వ్యయాలు పరిమితమవుతాయని, అనిశ్చితి కారణంగా ప్రైవేటు రంగమూ భారీ పెట్టుబడులకు దూరంగా ఉండొచ్చని పేర్కొంటున్నారు.

## వేలానికి 25.62 మి.టన్నుల బొగ్గు

### కోల్ ఇండియా




**న్యూఢిల్లీ:** పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో పరిశ్రమలపై ఇంధన భారాన్ని తగ్గించేందుకు, ఈ నెలలో ఆన్‌లైన్ వేలం ద్వారా 25.62 మిలియన్ టన్నుల బొగ్గు విక్రయించాలని ప్రభుత్వ రంగ సంస్థ కోల్ ఇండియా భావిస్తోంది. పశ్చిమాసియా నుంచి ఎల్ఎన్‌జీ, ఎల్పీజీ, ముడిచమురు సరఫరాలో ఏర్పడిన అంతరాయాల వల్ల బొగ్గుకు డిమాండ్ పెరిగింది. తద్వారా బొగ్గు దిగుమతి ధరలు కూడా అధికమయ్యాయి. ఈ ఏడాది మార్చిలో ఇ-వేలం ద్వారా 32.532 మి.టన్నుల బొగ్గును కోల్ ఇండియా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఫిబ్రవరిలో ఇది 20.5 మి.టన్నులుగా ఉంది. బొగ్గు కొనుగోలు ప్రక్రియను సులభతరం చేయడానికి, పారదర్శకత పెంచడానికి 2022లో ప్రారంభించిన 'సింగిల్ విండో మోడ్ అగ్నోస్టిక్' వేలం పద్ధతి ద్వారా ఈ విక్రయాలు జరగనున్నాయి. కోల్ ఇండియా వేలం ప్రకారం.. మహానది కోల్‌ఫీల్డ్స్ (8.5 మి.టన్నులు), ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ (4.7 మి.టన్నులు), భారత్ కోకింగ్ కోల్ (3.8 మి.టన్నులు), సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్ (3.2 మి.టన్నులు), సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ (3 మి.టన్నులు), వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ (2 మి.టన్నులు), నార్దర్న్ కోల్‌ఫీల్డ్స్ (0.6 టన్నులు), నార్త్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ (0.02 మి.టన్నులు) చొప్పున విక్రయించనున్నాయి.

# చిన్నస్వామిలో హైస్కోరింగ్ మ్యాచ్...

# సీఎస్కేపై ఆర్సీబీ ఘనవిజయం..

### చరిత్ర సృష్టించిన భువీ!



**బెంగళూరు:** బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వేదికగా జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఆకట్టుకునే ప్రదర్శన కనబరిచింది. పరుగుల వరద పారిన ఈ హై-స్కోరింగ్ మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌పై 43 పరుగుల తేడాతో ఆర్సీబీ ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ 20 ఓవర్లలో 3 వికెట్లకు 250 పరుగులు చేయగా... 251 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో చెన్నై విఫలమైంది.

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న చెన్నై నిర్ణయం బెడిసికొట్టింది. ఆర్సీబీ బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. ఓపెనర్లు ఫిలిప్ సాల్ట్ (46), విరాట్ కోహ్లీ (28) మంచి ఆరంభాన్ని ఇవ్వగా, దేవదత్ పడిక్కల్ (50) అర్ధశతకంతో ఆకట్టుకున్నాడు. అయితే, అసలు విధ్వంసం ఆఖరి ఓవర్లలో చోటుచేసుకుంది. కెప్టెన్ రజత్ పటీదార్ (19 బంతుల్లో 48 నాటౌట్), టిమ్ డేవిడ్ (25 బంతుల్లో 70) ఆకాశమే హద్దుగా చెలరేగారు. వీరిద్దరూ కలిసి కేవలం 35 బంతుల్లోనే 99 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. దీంతో ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 250 పరుగుల భారీ స్కోరు సాధించింది.

భారీ లక్ష్య ఛేదనలో చెన్నై సూపర్ కింగ్స్ గట్టిగానే పోరాడింది. సర్ఫరాజ్ ఖాన్ (25 బంతుల్లో 50) అర్ధశతకంతో రాణించగా, ప్రశాంత్ వీర్ (43), జేమీ ఓవర్టన్ (37) మెరుపులు మెరిపించారు. అయితే, ఆరంభంలోనే రుతురాజ్ గైక్వాడ్, సంజూ శాంసన్ వికెట్లను త్వరగా కోల్పోవడం జట్టుపై ఒత్తిడి పెంచింది. బ్యాటర్లు పోరాడినా, లక్ష్యం మరీ పెద్దది కావడంతో చెన్నై 19.4 ఓవర్లలో 207 పరుగులకు ఆలౌట్ అయింది.

ఈ మ్యాచ్ ద్వారా ఆర్సీబీ పేసర్ భువనేశ్వర్ కుమార్ అరుదైన చరిత్ర సృష్టించాడు. మూడు కీలక వికెట్లు పడగొట్టిన భువీ, ఐపీఎల్ చరిత్రలో 200 వికెట్ల మైలురాయిని



అందుకున్నాడు. ఈ ఘనత సాధించిన తొలి ఫాస్ట్ బౌలర్‌గా నిలిచి సరికొత్త రికార్డు నెలకొల్పాడు. అతడితో పాటు అభినందన్ సింగ్, కృనాల్ పాండ్యా రెండేసి వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.

భువనేశ్వర్ స్పెషల్

భువనేశ్వర్ కుమార్ ఐపీఎల్‌లో 200 వికెట్లు పడగొట్టిన మొట్టమొదటి ఫాస్ట్ బౌలర్‌గా, ఓవరాల్‌గా రెండో బౌలర్‌గా అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. బెంగళూరు వేదికగా చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే)తో జరిగిన మ్యాచ్‌లో చెన్నై బ్యాటర్ అయుష్ మహత్రేను ఔట్ చేయడం ద్వారా భువనేశ్వర్ ఈ ఫీట్ సాధించాడు. ఇంతకుముందు లెగ్ స్పిన్నర్ యుజువేంద్ర చాహల్ (224 వికెట్లు) మాత్రమే ఈ మైలురాయిని అందుకున్నాడు.

2011లో పుణే వారియర్స్ ద్వారా ఐపీఎల్‌లోకి అడుగుపెట్టిన భువనేశ్వర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) జట్టుకు సుదీర్ఘ కాలం ప్రాతినిధ్యం వహించాడు. 2016, 2017 సీజన్లలో వరుసగా రెండుసార్లు పర్పుల్ క్యాప్ గెలుచుకున్న ఏకైక బౌలర్‌గా చరిత్రకెక్కాడు. ముఖ్యంగా 2016లో ఎస్ఆర్‌హెచ్ టైటిల్ గెలవడంలో భువీ కీలక పాత్ర పోషించాడు. తన కెరీర్‌లో పవర్‌ప్లేలో అత్యధికంగా 81 వికెట్లు తీయడమే కాకుండా, డెత్ ఓవర్లలోనూ 93 వికెట్లతో సత్తా చాటాడు. ప్రస్తుతం 36 ఏళ్ల వయసులోనూ ఆర్‌సీబీ బౌలింగ్ దళానికి కీలకంగా మారిన భువనేశ్వర్, తన స్వింగ్ బౌలింగ్‌తో ఇప్పటికీ రాణిస్తుండటం విశేషం.

## టీ20 క్రికెట్లో రోహిత్ శర్మ రికార్డు తిరగరాసిన కోహ్లీ



**బెంగళూరు:** రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టీ20 క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఒకే ప్రత్యర్థిపై అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఐపీఎల్ 2026లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే)తో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘనత సాధించాడు. ఈ మ్యాచ్‌లో 28 పరుగులు చేయడం ద్వారా హిట్ మ్యాన్ రోహిత్ శర్మ పేరిట ఉన్న రికార్డును కోహ్లీ తిరగరాశాడు.

బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌కు ముందు, కోల్‌కతా నైట్ రైడర్స్‌పై 1,161 పరుగులతో రోహిత్ శర్మ ఈ రికార్డును కలిగి ఉన్నాడు. తాజా ఇన్నింగ్స్‌తో చెన్నైపై కోహ్లీ మొత్తం పరుగుల సంఖ్య 1,188కి చేరింది. దీంతో టీ20 ఫార్మాట్‌లో ఒకే జట్టుపై అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా విరాట్ అగ్రస్థానంలో నిలిచాడు. ఆసక్తికరంగా, ఈ జాబితాలో పంజాబ్ కింగ్స్‌పై 1,159 పరుగులతో కోహ్లీ మూడో స్థానంలో కూడా ఉండటం విశేషం.

ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 250 పరుగుల భారీ స్కోరు చేసింది. ఇది ఈ సీజన్‌లో ఇప్పటివరకు నమోదైన అత్యధిక స్కోరు. దేవదత్ పడిక్కల్ (50), ఫిలిప్ సాల్ట్ (46) శుభారంభం అందించగా, కెప్టెన్ రజత్ పటిదార్ (48), టిమ్ డేవిడ్ (70) ఆకాశమే హద్దుగా చెలరేగారు. ఈ ఇద్దరూ కేవలం 36 బంతుల్లోనే 99 పరుగులు జోడించారు.

## బంగ్లాదేశ్ క్రికెట్లో సంక్షోభం...

### నలుగురు బోర్డు డైరెక్టర్ల రాజీనామా...

### చివరి వ్యక్తిగానే వెళతానన్న చీఫ్




**ఢాకా:** బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది. శనివారం ఒక్కరోజే నలుగురు డైరెక్టర్లు రాజీనామా చేయడంతో బోర్డులో ప్రకంపనలు మొదలయ్యాయి. ఆరు నెలల క్రితం బాధ్యతలు స్వీకరించిన డైరెక్టర్ల బృందంలో ఇప్పటివరకు ఏడుగురు తప్పుకోవడంతో బంగ్లా క్రికెట్ భవిష్యత్తుపై ఆందోళన నెలకొంది. ఈ పరిణామాల మధ్య, తాను మాత్రం రాజీనామా చేసేది లేదని బీసీబీ అధ్యక్షుడు అమీనుల్ ఇస్లామ్ స్పష్టం చేశారు. "ఒకవేళ నేను కూడా రాజీనామా చేయాల్సి వస్తే చివరి వ్యక్తిగానే వెళతాను" అని ఆయన తేల్చిచెప్పారు.

శనివారం జరిగిన బోర్డు సమావేశం అనంతరం డైరెక్టర్లు సనియన్ తనీమ్, మెహ్రాబ్ అలం, ఫైయాజుర్ రహ్మాన్, మంజురుల్ అలం తమ పదవులకు రాజీనామా చేశారు. అంతకుముందే మరో ముగ్గురు కూడా వైదొలిగారు. దీంతో 25 మంది సభ్యులున్న బోర్డులో అస్థిరత ఏర్పడింది. ఈ పరిణామాలపై బీసీబీ అధ్యక్షుడు అమీనుల్ ఇస్లామ్ ఆదివారం స్పందించారు. తన బృందం నిజాయతీపరులతో కూడినదని, వారితోనే బంగ్లాదేశ్ క్రికెట్‌కు సేవ చేయాలనుకుంటున్నానని అన్నారు.

గత ఏడాది జరిగిన బీసీబీ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై బంగ్లాదేశ్ ప్రభుత్వం విచారణ కమిటీని నియమించింది. ఈ కమిటీ ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఎన్నికల ప్రక్రియలో తన ప్రమేయం పరిమితమని, రాజ్యాంగ ప్రకారమే నడుచుకున్నానని అమీనుల్ వివరణ ఇచ్చారు. మరోవైపు, క్రీడా మంత్రిత్వ శాఖ ఎన్నికల చెల్లుబాటుపై ప్రశ్నలు లేవనెత్తడం, టీ20 ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ పాల్గొనకపోవడం వంటి అంశాలు బోర్డుపై ఒత్తిడిని పెంచుతున్నాయి. బయటి శక్తుల జోక్యం వల్లే బంగ్లాదేశ్ క్రికెట్ స్తంభించిపోయిందని అమీనుల్ ఆరోపిస్తున్నారు. వరుస రాజీనామాలు, ప్రభుత్వ విచారణ నేపథ్యంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

# చివరి వరకు పోరాడిన సన్‌రైజర్స్...

### ఉత్కంఠ పోరులో లక్నో విజయం



**హైదరాబాద్:** సొంతగడ్డపై సన్‌రైజర్స్ హైదరాబాద్ వీరోచితంగా పోరాడినా ఓటమి నుంచి తప్పించుకోలేకపోయింది. ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కెప్టెన్ రిషభ్ పంత్ (68 నాటౌట్) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో లక్నోను గెలిపించాడు.

157 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నోకు మంచి ఆరంభం లభించింది. ఎయిడెన్ మార్క్రమ్ (45) వేగంగా ఆడాడు. అయితే, సన్‌రైజర్స్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేయడంతో మధ్యలో వికెట్లు కోల్పోయి ఒత్తిడికి గురైంది. కానీ, ఒకవైపు వికెట్లు పడుతున్నా కెప్టెన్ రిషభ్ పంత్ చివరి వరకు క్రీజులో నిలబడి జట్టును విజయతీరాలకు చేర్చాడు. 50 బంతుల్లో 9 ఫోర్లతో 68 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు.

ఆఖరి ఓవర్ లో లక్నో విజయానికి 9 పరుగులు కావాల్సి ఉండగా... పంత్ రెండు ఫోర్లు కొట్టడంతో స్కోరు సమం అయింది. 4 బంతుల్లో 1 పరుగు కావాల్సి ఉండగా... ఉనద్కట్ రెండు డాట్ బాల్స్ విసరడంతో ఉత్కంఠ పెరిగిపోయింది. మ్యాచ్ సూపర్ ఓవర్ కు దారితీస్తే బాగుండని సన్ రైజర్స్ అభిమానులు కోరుకున్నారు. అయితే, పంత్ మరో బౌండరీ కొట్టడంతో మ్యాచ్ సన్ రైజర్స్ చేజారింది. లక్నో 19.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. సన్‌రైజర్స్ బౌలర్లలో హర్ష్ దూబే 2 వికెట్లు తీశాడు. అంతకుముందు, టాస్ గెలిచిన లక్నో బౌలింగ్ ఎంచుకుంది. మహమ్మద్ షమీ (2/9) నిప్పులు చెరిగే బౌలింగ్‌తో సన్‌రైజర్స్ టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. ట్రావిస్ హెడ్ (7), అభిషేక్ శర్మ (0), ఇషాన్ కిషన్ (1) స్వల్ప స్కోర్లకే వెనుదిరగడంతో, పవర్ ప్లే ముగిసేసరికి రైజర్స్ 26 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులో కలిసిన హెన్రిచ్ క్లాసెన్, నితీశ్ కుమార్ రెడ్డి చరిత్రలో నిలిచిపోయే భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. వీరిద్దరూ లక్నో బౌలర్లపై ఎదురుదాడికి దిగి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఈ జోడీ ఐదో వికెట్‌కు 116 పరుగులు జోడించడంతో సన్‌రైజర్స్ కోలుకుంది. క్లాసెన్ 41 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 62 పరుగులు చేయగా, నితీశ్ రెడ్డి 33 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లతో 56 పరుగులు సాధించాడు. దీంతో సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 156 పరుగులు చేసింది.

MOVIE TIME

### సోనాక్షి ప్రెగ్నెన్సీ రూమర్స్‌పై

# పూనమ్ సిన్హా క్లారిటీ..

### నన్ను ఎన్నిసార్లు నానమ్మను చేశారో లెక్కే లేదు..



**టాకీస్:** బాలీవుడ్ స్టార్ హీరోయిన్ సోనాక్షి సిన్హా, ఆమె భర్త జహీర్ ఇక్బాల్ వైవాహిక జీవితంపై సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు పుకార్లు వినిపిస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా గత కొంతకాలంగా సోనాక్షి గర్భవతి అనే వార్తలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. తాజాగా ఈ రూమర్స్‌పై సోనాక్షి తల్లి పూనమ్ సిన్హా స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.ఒక ప్రైవేట్ కార్యక్రమంలో మీడియాతో మాట్లాడిన పూనమ్ సిన్హా, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై హాస్యాస్పదంగా స్పందించారు. "సోషల్ మీడియా వల్ల నన్ను ఇప్పటికే ఎన్నిసార్లు నానమ్మను చేసేశారో లెక్కే లేదు!" అంటూ నవ్వుతూ చెప్పారు. అయితే ఆ సంతోషకరమైన రోజు నిజంగా వచ్చినప్పుడు అందరికీ తెలుస్తుందని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా సోనాక్షి జననం గురించి గుర్తుచేసుకున్న పూనమ్, మా ఇంట్లోకి ఆడపిల్ల అడుగుపెట్టిన రోజు మా జీవితంలోనే గొప్ప రోజు. ఆడపిల్లలు లేని జీవితం అసంపూర్ణంగా ఉంటుంది. ప్రతి ఇంట్లోనూ ఒక ఆడపిల్ల ఉండటం ఎంతో ప్రత్యేకం అంటూ భావోద్వేగానికి గురయ్యారు. ఇటీవల ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో సోనాక్షి ఎరుపు దుస్తుల్లో కనిపించగా, ఆమె చేతిని పొట్టపై ఉంచుకున్న తీరు చూసి నెటిజన్లు గర్భవతి అని ఊహాగానాలు మొదలుపెట్టారు. దీంతో సోషల్ మీడియాలో మరోసారి ప్రెగ్నెన్సీ రూమర్స్ వైరల్ అయ్యాయి. ఈ తరహా పుకార్లపై గతంలోనే సోనాక్షి సిన్హా తనదైన శైలిలో స్పందించారు. "కేవలం చేతిని పొట్టపై పెట్టుకున్నందుకు నన్ను గర్భవతిని చేసేశారు. మానవ చరిత్రలోనే 16 నెలలు గర్భంతో ఉన్న వ్యక్తిగా నాకు రికార్డు ఇచ్చేశారు" అంటూ సరదాగా సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అటు జహీర్ ఇక్బాల్ కూడా ఒక వేడుకలో సోనాక్షి పొట్టపై చేయి వేసి "జాగ్రత్త" అంటూ సరదాగా స్పందించడం అప్పట్లో వైరల్ అయింది. సోనాక్షి, జహీర్ ప్రేమకథ కూడా ఆసక్తికరమే. 2013లో సల్మాన్ ఖాన్ ఇచ్చిన పార్టీలో తొలిసారి కలుసుకున్న వీరు, దాదాపు ఏడేళ్ల పాటు ప్రేమలో ఉన్నారు. చివరకు 2024లో ముంబైలో సన్నిహితుల సమక్షంలో స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ కింద రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నారు. అనంతరం సినీ ప్రముఖుల కోసం గ్రాండ్ రిసెప్షన్ నిర్వహించారు.

### టొవినో థామస్ 'పల్లిచట్టంబి'

# తెలుగు ట్రైలర్ విడుదల




**టాకీస్:** మలయాళ స్టార్ హీరో టొవినో థామస్ ప్రధాన పాత్రలో నటిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'పల్లిచట్టంబి' . వరల్డ్ వైడ్ ఫిలిమ్స్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. ఈ చిత్రం ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా సినిమా నుంచి తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్.

ఇక ట్రైలర్ చూస్తుంటే.. చారిత్రక నేపథ్యంలో సాగే సినిమా అని తెలుస్తుంది. ఇందులో టొవినో థామస్ ఒక మాస్ మరియు పవర్‌ఫుల్ లుక్‌లో కనిపిస్తున్నారు. 19వ శతాబ్దపు కేరళ సామాజిక పరిస్థితులను కళ్లకు కట్టినట్లు చూపించబోతున్నారని అర్థమవుతోంది. 'క్వీన్', 'జన గణ మన' వంటి సెన్సేషనల్ హిట్స్ అందించిన డిజో జోస్ ఆంటోనీ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా. కయాడ్‌లోహార్ కథానాయికగా నటిస్తుంది. 'పల్లిచట్టంబి' అంటే ఆ కాలంలో ఒక ప్రాంతానికి రక్షకుడిగా ఉన్న వ్యక్తి అని అర్థం. మలయాళంతో పాటు తెలుగు, తమిళం, కన్నడ మరియు హిందీ భాషల్లో ఈ చిత్రం గ్రాండ్‌గా విడుదల కాబోతుంది.

# కాలినడకన అన్ని మెట్లూ ఎక్కాల్సిందే..

### తిరుమల దర్శనంపై జాన్వీకపూర్


**టాకీస్:** తెలుగులో కూడా సూపర్ ఫ్యాన్ బేస్ ఉన్నభామల్లో టాప్‌లో ఉంటుంది జాన్వీకపూర్. భక్తి భావం ఎక్కువున్న బాలీవుడ్ ముద్దుగుమ్మల జాబితాలో కూడా ముందు వరుసలో ఉంటుంది. దివంగత అందాల తార శ్రీదేవి అడుగుజాడల్లో నడుస్తూ అభిమానులు, ఫాలోవర్లకు తల్లికి తగ్గ తనయగా ఎప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తూ ఉంటుంది.



సాధారణంగా సెలబ్రిటీలు ప్రఖ్యాత ఆలయాలను సందర్శించాలంటే వీఐపీ దర్శనం సౌకర్యం రెడీగా ఉంటుందని తెలిసిందే. ప్రత్యేకించి ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి గాంచిన తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం కోసం ఎంతోమంది సెలబ్రిటీలు వీఐపీ దర్శనం ద్వారా వెళ్తుంటారు. కానీ జాన్వీకపూర్ మాత్రం తనకు సులువుగా దేవుడిని దర్శించుకునే అవకాశమున్నప్పటికీ ఆ మార్గాన్ని వద్దనుకోవడం విశేషం. జాన్వీకపూర్ ఎప్పుడూ చూసినా మెట్ల మార్గం గుండా వెళ్లి దేవుడిని దర్శించుకోవడం చూస్తూనే ఉంటాం. ఎప్పుడు తిరుపతికి వెళ్లినా సాధారణ ప్రజల్లాగే కాలినడకన వెళ్లి తిరుమలేశుడిగా దర్శించుకుంటే గానీ ఈ భామకు సంతృప్తి కలగదట.

ఇదే విషయాన్ని తాజాగా ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. 'తిరుపతిలో శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనం ఒక్కసారి లభించినా చాలని భక్తులు గంటల తరబడి ఎలా వేచి ఉంటారో నాకు బాగా తెలుసు. నాకు అలాంటి సమయం దొరకడం పట్ల ఎంతో అదృష్టవంతురాలిగా భావిస్తా. ఏదేమైనా సరే నేను ప్రతిసారీ ఆ 3500 మెట్లనూ ఎక్కితే తప్ప, నా దర్శనం పరిపూర్ణమైనట్లు నాకు అనిపించదు. నేను కేవలం నేరుగా వెళ్లి దర్శనం చేసుకుని రాలేను. ఆ మెట్లన్నీ ఎక్కినప్పుడే నా దర్శన యాత్ర సంపూర్ణమైనట్లుగా భావిస్తానంటూ చెప్పుకొచ్చింది' జాన్వీకపూర్.

ఈ బ్యూటీ తను ఓ సెలబ్రిటీని అని ఏమాత్రం గర్వం లేకుండా ఇలా ప్రతీసారి కాలినడకన ఒక్కో మెట్టు ఎక్కి ప్రజల నుంచి అభిమానులను ప్రశంసలు అందుకుంటోంది.



### అడివి శేష్‌తో కలిసి 'డెకాయిట్' చిత్రంలో నటిస్తున్న మృణాల్ ఠాకూర్‌హో

### ముంబైలో ప్రమోషన్స్... మనసులోని మాట చెప్పిన బ్యూటీ

# హద్దులు దాటేంత పిచ్చి ప్రేమలో పడాలనుంది: మృణాల్ ఠాకూర్

టాకీస్: 'సీతారామం' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు బాగా దగ్గరైన నటి మృణాల్ ఠాకూర్, తన ప్రేమ అభిప్రాయాల గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హద్దులు దాటేంత పిచ్చి ప్రేమలో పడాలనుందని, తన కోసం అన్ని సరిహద్దులు చెరిపేసే వ్యక్తి ఇంకా తన జీవితంలోకి రాలేదని ఆమె అన్నారు. అడివి శేష్‌తో కలిసి ఆమె నటిస్తున్న 'డెకాయిట్' సినిమా ప్రచార కార్యక్రమం ముంబైలో జరిగింది. అందులో భాగంగా మీడియా అడిగిన ప్రశ్నకు ఆమె ఈ విధంగా స్పందించారు. "జీవితంలో అన్ని హద్దులు దాటేలా ప్రేమించే వ్యక్తి త్వరలోనే వస్తాడు. అప్పుడు ఏం జరుగుతుందో నేనే మీకు చెబుతాను" అంటూ ఆమె నవ్వుతూ సమాధానమిచ్చారు. షానీల్ డియో దర్శకత్వంలో సువిన్ ఎస్. సోమశేఖర్ నిర్మిస్తున్న 'డెకాయిట్' చిత్రం ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా మృణాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. మృణాల్ తన కెరీర్‌ను 'కుంకుమ్ భాగ్య' వంటి టెలివిజన్ సీరియళ్లతో ప్రారంభించారు. ఆ తర్వాత 'సూపర్ 30', 'జెర్సీ' వంటి హిందీ చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే, 'సీతారామం' చిత్రంలో ఆమె పోషించిన సీత పాత్రకు దేశవ్యాప్తంగా విశేష ప్రశంసలు దక్కాయి. ఇటీవల, నటుడు ధనుష్‌తో మృణాల్ డేటింగ్‌లో ఉన్నట్లు ఊహాగానాలు వస్తున్నాయి. ఓ కార్యక్రమంలో వీరిద్దరూ కలిసి కనిపించడంతో ఈ వార్తలు మరింత ఊపందుకున్నాయి. అయితే, ఈ రూమర్స్‌పై మృణాల్ గానీ, ధనుష్ గానీ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు.

# 'బైకర్'పై రామ్ చరణ్ ప్రశంసలు..

### శర్వానంద్ సినిమాకు మెగా బూస్ట్!




**టాకీస్:** టాలీవుడ్‌లో ఇటీవల విడుదలైన సినిమాల్లో ప్రత్యేక కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన చిత్రం బైకర్. శర్వానంద్ హీరోగా నటించిన ఈ రేసింగ్ బ్యాక్‌డ్రాప్ ఎమోషనల్ డ్రామా మంచి స్పందనను సొంతం చేసుకుంది. దర్శకుడు అభిలాష్ కృష్ణ తెరకెక్కించిన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుంటోంది. ఈ సినిమాపై తాజాగా మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ స్పందించడం హాట్ టాపిక్‌గా మారింది. 'బైకర్' గురించి చాలా మంచి విషయాలు వింటున్నానని, ఇలాంటి అరుదైన కాన్సెప్ట్‌తో సినిమా తీసినందుకు యూవీ క్రియేషన్స్‌కు హ్యాట్సాఫ్ అంటూ చరణ్ ప్రశంసలు కురిపించారు. ఇక ఈ సినిమాలో శర్వానంద్, డా. రాజశేఖర్ నటనకు మంచి స్పందన వస్తుండటం ఆనందంగా ఉందని చరణ్ పేర్కొన్నారు. ముఖ్యంగా తండ్రి--కొడుకు భావోద్వేగాలను హైలైట్ చేస్తూ వచ్చిన సన్నివేశాలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటున్నాయని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. దర్శకుడు అభిలాష్ కృష్ణ ఇలాంటి యూనిక్ కాన్సెప్ట్‌ను ఎంచుకుని తెరకెక్కించడం గొప్ప విషయమని రామ్ చరణ్ అభినందించారు. ప్రస్తుతం కమర్షియల్ ఫార్ములా సినిమాల మధ్య ఇలాంటి కొత్త ప్రయత్నాలు రావడం ఇండస్ట్రీకి మంచి సూచిక అని ఆయన అభిప్రాయపడ్డారు.

రామ్ చరణ్ వంటి స్టార్ హీరో నుంచి వచ్చిన ఈ ప్రశంసలు 'బైకర్' సినిమాకు మరింత హైప్ తీసుకువచ్చాయి. ఇప్పటికే పాజిటివ్ టాక్‌తో థియేటర్లలో రన్ అవుతున్న ఈ చిత్రం, ఇప్పుడు మరింత ప్రేక్షకులను ఆకర్షించే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. బైకర్ పై రామ్ చరణ్ చేసిన కామెంట్స్ సినిమా యూనిట్‌కు పెద్ద బూస్ట్‌గా మారాయి. శర్వానంద్ కెరీర్‌లో మరో సక్సెస్‌గా ఈ చిత్రం నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక రామ్ చరణ్ ప్రస్తుతం పెద్ది సినిమాతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ఈ మూవీ ఏప్రిల్ 30న విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌కి మంచి టాక్ వచ్చింది. పెద్ది కూడా బాక్సాఫీస్‌ని షేక్ చేయనుందని అంటున్నారు.

# 'రాకాస' బాక్సాఫీస్ దూకుడు..

### రెండు రోజుల్లోనే 10 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్!

**టాకీస్:** ఇటీవల విడుదలైన రాకాస చిత్రం రిలీజ్‌కు ముందే యూత్ ఆడియన్స్‌లో భారీ అంచనాలను క్రియేట్ చేసుకుంది. ఆ క్రేజ్‌కు తగ్గట్టుగానే సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్ నమోదు చేస్తూ ట్రేడ్ వర్గాల దృష్టిని ఆకర్షిస్తోంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, 'రాకాస' మొదటి రోజున ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.6 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. ఈ చిత్రం యూత్ ఆడియన్స్‌లో మంచి హైప్ సృష్టించడంతో మొదటి రోజు నుంచే థియేటర్లలో మంచి ఆక్యుపెన్సీ కనిపించింది. షేర్ పరంగా చూస్తే, ఫస్ట్ డే వరల్డ్‌వైడ్‌గా రూ.2.51 కోట్ల షేర్



నమోదైంది. ఇందులో తెలుగు రాష్ట్రాల నుంచే రూ.1.76 కోట్ల షేర్ రావడం విశేషం. కర్ణాటక మరియు రెస్ట్ ఆఫ్ ఇండియా నుంచి రూ.15 లక్షలు, ఓవర్సీస్ మార్కెట్ నుంచి రూ.60 లక్షల షేర్ వచ్చినట్లు ట్రేడ్ రిపోర్ట్స్ చెబుతున్నాయి.

రెండవ రోజు కూడా 'రాకాస' తన బాక్సాఫీస్ రన్‌ను స్టెడీగా కొనసాగించింది. ప్రపంచవ్యాప్తంగా రెండో రోజు ఈ చిత్రం రూ.10.30 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్‌ను దాటింది. కర్ణాటక: రూ.20 లక్షలు, ఓవర్సీస్: రూ.50 లక్షలు మొత్తం మీద రెండో రోజు వరల్డ్‌వైడ్‌గా రూ.2.30 కోట్ల షేర్ వసూళ్లు నమోదయ్యాయి. రెండు రోజులకు కలిపి మొత్తం రూ.4.80 కోట్ల షేర్ వచ్చినట్లు ట్రేడ్ విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ప్రత్యేకంగా ఓవర్సీస్ మార్కెట్‌లో 'రాకాస' మంచి పర్ఫార్మెన్స్ కనబరుస్తోంది. ఇప్పటికే కోటి రూపాయల షేర్ మార్క్‌ను దాటిన ఈ చిత్రం, ఫైనల్‌గా రూ.2 కోట్లలోపే క్లోజ్ అయ్యే అవకాశాలు ఉన్నాయని అంచనా.

సోషల్ మీడియాలో ఈ సినిమా కలెక్షన్స్‌ను ఉస్తాద్ భగత్ సింగ్ తో పోలుస్తూ చర్చలు జరుగుతున్నాయి. అయితే ఆ చిత్రంతో పోలిస్తే 'రాకాస' ఆ స్థాయిని చేరడం కష్టమని ట్రేడ్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. మూడవ రోజు కూడా ఈ చిత్రం డీసెంట్ హోల్డ్‌ను కొనసాగించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. బుక్‌మైషో ట్రెండ్స్ ప్రకారం ప్రతి గంటకు 3 వేలకుపైగా టికెట్లు అమ్ముడవుతున్నాయి. అయితే ఈ సినిమా బ్రేక్ ఈవెన్ సాధించాలంటే రాబోయే రోజుల్లో కూడా ఇదే స్థాయి కలెక్షన్స్ కొనసాగించాల్సి ఉంటుంది. ముఖ్యంగా వీకెండ్ తర్వాత కలెక్షన్స్ ఎలా ఉంటాయన్నదే కీలకం కానుంది. రాకాస చిత్రం యూత్ ఆడియన్స్ సపోర్ట్‌తో బాక్సాఫీస్ వద్ద మంచి రన్ కొనసాగిస్తోంది. మొదటి రెండు రోజుల్లోనే పాజిటివ్ ట్రెండ్ చూపించిన ఈ సినిమా, వచ్చే రోజుల్లో ఎలాంటి కలెక్షన్స్ సాధిస్తుందో చూడాలి.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.